ప్రజా రచయిత
ఆళ్వారు స్వామి

ప్రజాశక్తి
సోపతి
అక్టోబర్ 26, 2014 ఆదివారం అనుబంధం

పల్లెలకు ఆదర్శం

- తోకల రాజేశం, జి. రామకృష్ణ కవితలు
- సినారె పుస్తకంపై సమీక్ష
- 'వర్తమానం' ఆనందపు ఆవరణ
- బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలి

జూలియా రాబర్ట్స్‌కు మానవతా పురస్కారం

జీవితంలో కొన్ని సంఘటనలు చిత్రంగా ఉంటాయి. పాతికేళ్ళ కిందట సినీరంగంలోకి కొత్తగా తడబడే అడుగులతో వచ్చిన నటి తన తొలి షూటింగ్‌జరిగిన ప్రదేశంలోనే ఒక ప్రతిష్ఠాత్మక అవార్డును అందుకోవడం అరుదైన అనుభవం. అలాంటి అపురూప అనుభవం పొందిన నటి జూలియా రాబర్ట్స్. అలనాడు ఆమె నటించిన 'ప్రెట్టీ ఉమెన్' చిత్రం ద్వారా సినీ ప్రేక్షకులకు గుర్తుండిపోయారు. ఆ తర్వాత ఈ పాతికేళ్ళ ప్రయాణంలో ఎన్నో మంచి సినిమాల్లో ఉదాత్తమైన పాత్రల్లో నటించారు. ఎల్.జి.బి.టి (లెస్బియన్, గే, బైసెక్సువల్, ట్రాన్స్‌జెండర్ సమూహాల కోసం అందిస్తున్న సేవలకు గాను మానవతా పురస్కారం (హ్యూమానిటేరియన్ అవార్డు)ను లాస్ ఏంజిల్స్‌లోని రెజెంట్ బెవర్లీ విల్స్‌హైర్ హోటల్‌లో ఈ నెల పదిహేడో తేదీన జరిగినకార్యక్రమంలో అందజేశారు. పాతికేళ్ళ కిందట 'ప్రెట్టీ ఉమెన్' సినిమా షూటింగ్ ఇదే హోటల్‌లో జరిగింది. ఇప్పుడు ఆ హోటల్ యాజమాన్యం ఆమెని సగౌరవంగా, సాదరంగా ఆహ్వానించింది. హాలీవుడ్‌లో వెండితెర మీద, బయటా ఆమె ఎంత హుందాగా వ్యవహరించే నటిగా గుర్తింపు ఉంది. పర్యావరణాన్ని కాపాడే పాత్రల్లోనూ, మానవ జీవన తాత్విక చింతనకు సంబంధించిన పాత్రల్లోనూ ఆమె సహజసిద్ధంగా నటించారు. కొన్నాళ్ళ కిందట ఆమె నటించిన 'ఈట్ ప్రే లవ్' చిత్రంలో కొంత భాగం మనదేశంలో షూటింగ్ జరిగింది. ఆ చిత్రం ఆమె ప్రతిభను మరింతగా లోకానికి తెలియజేసింది. నిజానికి సినిమాని ఒక కళగా ఆరాధించే తెలుగు ప్రేక్షకుల్లోని కొన్ని సమూహాలు జూలియా రాబర్ట్స్ పట్ల ప్రత్యేక గౌరవాన్ని, అభిమానాన్ని చూపుతాయి.

చూడాల్సిన సినిమా!

ఒక మాట, ఒక దృశ్యం, ఒక సన్నివేశం, ఒక అభివ్యక్తి చూడగానే లాక్కెళ్ళాలి. వెంటాడాలి. ఎక్కడికెళ్ళినా మన లోపల తారాట్లాడాలి. ఆ దృశ్యం తాలూకు సంగీతం అంతరంగంలో ప్రవహించి నిలువనియ్యని తనానికి లోను చేయాలి. ఇలాంటి మిశ్రమానుభూతులకు లోను చేసే చిత్రం 'నెవర్ లెట్ మి గో'. 2010 సంవత్సరంలో వచ్చిన చిత్రమిది. మానవ ఉద్వేగాలకు సంబంధించిన ఘర్షణని సహజసిద్ధంగా ప్రతిఫలించిన సినిమా. దీని నేపథ్య సంగీతం మన లోలోపల రక్తచలన గీతమై ప్రవహిస్తుంది. రాచెల్ పోర్ట్‌మన్ అనే మహిళ ఈ సినిమాకి సంగీతాన్ని సమకూర్చింది. విన్నకొద్దీ వినాలనిపించే సంగీత మధురిమలవి. ఒక్కొక్కమాట కవితాత్మక వచనంతో పరిమళిస్తుంది. మాటల్లో చెప్పలేని భావాలు పాత్రల అభివ్యక్తిలో, నటనా కౌశలంలో ఒదిగిపోయి మనల్ని భావోద్వేగాలకు లోనుచేస్తాయి. జీవితానికి సంబంధించిన తాత్విక ప్రశ్నల్ని ముందు పెడతాయి. కాజు ఇష్‌గురు రాసిన నవల 'నెవర్ లెట్ మి గో' ఆధారంగా రూపొందిన సినిమా ఇది. లండన్, టోరంట్ చలనచిత్రోత్సవాల్లో ప్రదర్శితమై ప్రశంసలు అందుకుంది. సైన్స్‌ఫిక్షన్, డ్రామా కలగలిసిన ఆసక్తికరమైన ఇతివృత్తం ఈ చిత్రానికి భూమిక. అవయవ దానం కోసమే నిండైన ఆరోగ్యంతో పెంచబడటం ఒక వైచిత్రి. అలా ఏదో సమయాన అవయవదానం కారణంగా నిష్క్రమించక తప్పదని తెలిసినా ఉద్వేగపూరిత ప్రేమకు లోనవడం, ఆ ప్రేమ కోసం జీవించాలనుకోవడం, ఆ అవకాశం లేని పరిస్థితుల నడుమ ఉండే మానసిక సంఘర్షణకు కళాత్మక రూపం 'నెవర్ లెట్ మి గో'. ఇతివృత్తం ఇదే అని నిర్ధారించడానికి వీల్లేని సృజనాత్మక వైశాల్యం ఈ చిత్రం ప్రత్యేకత. సాహిత్య, కళా రంగాల్లో వున్నవారయినా చూడాల్సిన సినిమా! చూసి చర్చించాల్సిన సినిమా!!

■ అంతరంగం

లోపలి ప్రపంచం

ఒక విషయంలో పదిమంది బుకాయించవచ్చుగానీ ఆత్మలోకంలో తమని తాము తప్పించుకోవడం సాధ్యం కాదు. ఒక పొరపాటు జరిగితే బయటికి ఒప్పుకోలేకున్నా తమ లోపలి ప్రపంచానికి తెలుస్తుంది. ఏది తప్పు, ఏది ఒప్పు అని మనసు చెప్పే మాటని కాదనడం సులువు కాదు. తప్పు చేసి చట్టాన్ని తప్పించుకోగలిగినా ఆత్మ నుంచి పలాయనం చిత్తగించలేరు. ఈ వేదనకు మంచి ఉదాహరణ దోస్తోవిస్కీ 'నేరం-శిక్ష' నవలలో సృజించిన రాస్కోల్నికోవ్ పాత్ర. చిన్నపాటి దొంగతనం చేయబోయి ఒక ముసలావిడని చంపేస్తాడు. తాత్కాలికంగా పోలీసుల్ని తప్పించుకోగలిగినా, అతను ఎక్కడున్నా, ఏం చేస్తున్నా ఆత్మ రొద పెడుతూనే వుంటుంది. నేర భావన అతణ్ణి కుదిపేస్తుంటుంది. నిమిషం నిలువనియ్యని ఆందోళనకు లోను చేస్తుంది.

సాదాసీదాగా బతుకు బండిని లాగించేవారు నీతిగా ఉండటానికే ప్రయత్నిస్తారు. తప్పులు, నేరాలు చేయడానికి ప్రయత్నించరు. తప్పని పరిస్థితుల్లో తప్పులు చేస్తే తమలో తాము కుమిలిపోతారు. మరీ ముఖ్యంగా ఇతరులకు ఎక్కువ కీడు కలిగించిన పనులు చేస్తే మనసు నిమ్మళంగా ఉండదు. నిశ్చింతగా ఉండలేరు. మనస్సాక్షి ముందు దోషులుగా నిలబడతారు. బయటి మనుషుల్ని తప్పించుకున్నా అంతరంగాన్ని బుకాయించలేరు.

అందువల్లనే సాటి మనుషులకు వీలయినంత తక్కువ కీడు, ఎక్కువ మేలు జరిగేలా ప్రవర్తించడం శ్రేయస్కరం. ఇది మంచితనానికి చిన్న గీటురాయి. అలాగే ఆత్మలోకం ముందు నిబ్బరంగా నిలబడటానికి ఉపకరించే సంవిధానం. ఈ కారణంగానే మానవులు అప్పుడప్పుడు తమ లోపలికి తాము చూసుకోవడం మంచిదని తత్వవేత్తలు చెబుతారు. ఇదేమీ మెట్ట వేదాంతం కాదు. 'ఈ నెలలో నేను ఎవరికయినా నొప్పి కలిగించేలా ప్రవర్తించానా, బాధపడేలా వ్యవహరించానా' అని నెలకు ఒక్కసారయినా తరచి చూసుకోవాలి. మీ తప్పుల లేదా పొరపాట్ల ఫలితంగా తాత్కాలికంగా కొందరు బాధపడి, తర్వాత మరిచిపోవచ్చు గాక. కానీ మీ తప్పు మీకు తెలుస్తుంది. అది మిమ్మల్ని కుదిపేస్తుంటుంది. మీ వల్ల బాధపడిన మనుషులు తారసపడితే మీ పొరపాట్లు మీకు గుర్తొచ్చి మాట్లాడటానికి జంకుతారు. బిడియపడతారు. ఆ పొరపాట్లను ప్రస్తావించకుండా వారు మీతో మామూలుగా సంభాషిస్తే అది మిమ్మల్ని మరింత బాధిస్తుంది. అందుకని జరిగిన పొరపాట్లకు సంబంధించి ఆలస్యమైనా క్షమాపణలు కోరుతూ చిన్న ఉత్తరం రాయండి. ఎదుటివారు మిమ్మల్ని అర్థం చేసుకుంటారు. మీరు నిశ్చింతగా ఉంటారు. మీ లోపల మీరు కుమిలిపోయే స్థితి సమసిపోతుంది. అనేకానేక సంక్లిష్టతలతో కూడిన సమాజంలో అనవసరంగా కోపావేశాలకు లోనయి ఎదుటి వారిని నొప్పించే సందర్భాలుంటాయి. నింపాదిగా తర్వాత పశ్చాత్తాపపడతారు కొందరు. ఆ పశ్చాత్తాపం లోంచి తేరుకోవాలంటే నొప్పించేవారికి 'ఫర్‌గివ్ మి' (నన్ను క్షమించు) అంటూ చిన్న ఉత్తరం లేదా మెసేజ్ పంపించడం ఉత్తమం. మీ సంస్కారానికి ఎదుటివారు అంతే దయతో స్పందిస్తారు. విరోధభావం ముగిసిపోతుంది. ఇద్దరి నడుమ స్నేహభావం చిగురిస్తుంది.

వెంటాడే వాక్యం

పాము తలపై అందమైన రత్నం ఉన్నా అది కాటు వేస్తుందన్న భయంతో ఎలా దూరంగా ఉంచుతామో అదేవిదంగా దుర్జనుడు ఎంత విద్యావంతుడైనా అతణ్ణి దూరంగా ఉంచాలి. - భర్తృహరి

ప్రజాశక్తి సోపతి

అక్టోబర్ 26, 2014

లేఖలు	4
సంగీతం	
వెన్నెల వాకిట్లో రసరమ్య గీతాలు	5
కవర్‌స్టోరీ	
పల్లెలకు ఆదర్శం	6
ఎరుక 'వర్తమానం' ఆనందపు ఆవరణ	10
వ్యంగ్య వీచికలు	11
స్మరణ ప్రజారచయిత ఆళ్వారుస్వామి	12
అణాగ్రంథమాల పాత్ర అపూర్వం	13
నెమలీక	14
సీరియల్ ప్రేమ - విప్లవం	16
కథ బహుళరాగం	18
సోర్స్‌కోడ్ వాట్స్‌యాప్ వాడుతున్నారా?	21
బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలీ.	22
సమీక్షలు	
సృష్టి తాత్వికతను అంచనా కట్టే	
కవితా జిజ్ఞాస	24
నచ్చిన పుస్తకం చలం 'జెలసీ' కథలు	25
ఈ వారం కవిత్వం	
అయినా సంతోషంగానే ఉంది	26



వరంగల్ జిల్లాలోని గంగదేవిపల్లి జాతీయస్థాయిలో పల్లెలన్నిటికి 'ఆదర్శగ్రామం'గా నిలిచింది. ఈ స్థాయిని సాధించడానికి ఆ గ్రామం సాగించిన ప్రయాణపు తీరుతెన్నుల విశ్లేషణే ఈ వారం ముఖచిత్ర కథనం.

లేఖలు

'నియంత్రణే నివారణ మార్గం'
అక్షర సత్యం



12 అక్టోబర్ ప్రజాశక్తి సోపతి సంచికలో కవర్‌స్టోరీ కథనం 'నియంత్రణే నివారణ మార్గం' చదివిన తర్వాత మన నిత్యజీవితంలో తీవ్రమైన మానసిక ఒత్తిడి మూలంగా అధిక రక్తపోటు లాంటివి దరిచేరుతున్నా కనీస అవగాహన లేక ఆందోళన చెందుతున్నాం. సాధారణ స్థాయిలో 120-80 ఉంటే అనారోగ్యం దరిచేరదని వైద్యులు చెబుతున్నారు. నేటి కాలంలో సరైన వ్యాయామం లేక జీవనశైలిలో మార్పుల మూలంగా ప్రపంచ వ్యాప్తంగా అధిక రక్తపోటుతో ఏటా 89 లక్షల మంది మృత్యువాత పడుతున్నారని తెల్సుకున్నాం. నిద్ర లేవగానే ప్రతి ఒక్కరూ వ్యాయామాన్ని అలవాటుగా మరల్చుకొని, ఆయుర్వేదం ప్రకారం మనం తినే ఆహారంలో మార్పులు చేసుకుని ఒత్తిడిలేని జీవితంని గడిపితే రక్తపోటు నుండి దూరంగా ఉండవచ్చు. వ్యాసకర్త శ్రీరామమూర్తికి, ప్రజాశక్తి సోపతికి ధన్యవాదాలు.

– కామిడి సతీష్ రెడ్డి, పరకాల, వరంగల్ జిల్లా

ఆరోగ్య కథనాలు ఇంకా ఇవ్వాలి

బిపికి నియంత్రణ ఒక్కటే మార్గమన్న దానికి వివరణ బాగుంది. ఆధునిక జీవన చక్రంలో పడి వేళా పాళా లేని భోజన సమయాలు, నిద్ర సమయాలు, ఏవి పడితే అవి తినడం వల్ల ఆరోగ్యం క్షీణిస్తుంది. వాటి వలన ఎప్పుడులేని ఎన్నో కొత్తకొత్త రోగాలు మానవుని చుట్టుముడుతున్నాయి. అదే కోవకు చెందినదే ఈ బిపి కూడా. అలాంటి దాని గురించి వివరంగా ఇచ్చిన సోపతికి ధన్యవాదాలు. ఇలాగే ఆరోగ్య రహస్యాలను అప్పుడప్పుడు ఇవ్వగలరని కోరుతున్నాం.

– అనురాగ్, జీవన్ హైద్రాబాద్

నవరాగం బాగుంది

నవరాగం 'ఇష్టాన్ని గమనిస్తున్నారా?' బాగుంది. ఒకరి ఇష్టాలను ఒకరు తెలుసుకొని మనగలిగినప్పుడే వారి మధ్య దాంపత్యం అయినా, స్నేహమైన చిరకాలం సజీవంగా ఉంటుంది. అలా చెబుతున్న ఈ వ్యాసం ఎంతో ఆసక్తికరంగా ఉంది. నవరాగంలోని వస్తున్న వ్యాసాలు చాలా బాగుంటున్నాయి.

– రవి, వనపర్తి, మహబూబ్‌నగర్

ఎంతో నోరూరింది

తిండి కలిగితే కండ కలదోయ్... కండగలవాడేనూ మనిషోయ్ అన్నారు గురజాడ. కాని ఈ కాలం యువతకు తిండి అంటే పిజ్జాలు, బర్గర్ల లాంటి జంక్ ఫుడ్స్ మాత్రమే. అందుకే ఆ తరం పాటలు ఒకసారి వినిపించిన మా నోరూరించిన సోపతికి ధన్యవాదాలు.

– అఖిల్, సంగారెడ్డి

ప్రతివారం నెమలీక

ప్రజాశక్తి సోపతి ఆదివారం అనుబంధంలోని నెమలీక , పాలకంకి చిన్న పిల్లల పేజీలను తప్పకుండా చదువుతాను. మా స్కూల్ టీచర్ కూడా ప్రతి వారం సోపతి అనుబంధాన్ని తెచ్చి అందులోని మంచి విషయాలను మాతో చదివిస్తారు. పాఠశాల గోడపత్రికలో ఈ పేజీలను అతికించి విద్యార్థులందరం చదువుతాం. పొడుపుకథలు, కథ, జతచేయడం, రంగులు వేద్దాం మమ్ములను ఎంతగానో ఆకట్టుకుంటాయి.

– వారికాడి కిరణ్మయి, 7వతరగతి, కర్కపల్లి, వరంగల్ జిల్లా

మన జాతీయాలు

పైగొట్టు

ఎటు ప్రయాణించాలన్నా ఎడ్లబండే తప్ప మరో సాధనం లేని కాలం. శుభకార్యాల్లో ప్రయాణాలు కొనసాగించే సందర్భాల్లో ముందటి బండిని దాటే ప్రయత్నమే పైగొట్టటం. రైతులు పండిన ధాన్యాన్ని బోరెంలో నింపుకొని అంగడికి ప్రయాణించేవారు. వందల కిలోమీటర్లు ఎడ్ల బండ్ల ద్వారానే ప్రయాణం సాగేది. చీకటి బడితే వెనక బండికి ప్రమాదం వుండేది. దొంగలు బోరెంకు చిల్లు పొడిచి కారుతున్న ధాన్యాన్ని గుల్లల్లో పట్టుకొని పారిపోయేవారు. బండ్ల చప్పుళ్ళల్లో ఇదెవరికి తెలిసేది కాదు. అందుకని వెనకబడి వుండకూడదని పైగొట్టటానికి ప్రయత్నించేవారు. "ఆ పార్టీ వాళ్ళు ప్రచారంలో మన నెప్పుడో పైగొట్టారు" అనటంలో ఈ జాతీయం వాడకం వుంది.

చీమకు రెక్కలచ్చినట్లు

చీమల్లో ఎన్నో రకాలుంటాయి. చాలా వాటికి రెక్కలుండవు. కొన్ని చీమలకు మాత్రం రెక్కలుంటాయి. నల్లని చిన్న చీమలు మెరుపు వేగంతో పరుగెత్తుతాయి. అలాంటి వేగంగా పరిగెత్తె చీమకు రెక్కలు వస్తే ఇంకా ఆగేపని లేదు. పరుగు వేగమే పైగా ఎగిరి ఇంకొక చోట వాలటం అదనపు సౌకర్యం. ఒక స్థాయి బతుకు దోవ కలిగిన వానికి లక్ష రూపాయల లాటరీ వస్తే ముందు కొద్దిగా స్థితిమంతుడైనందుకే మిడిసిపడే వానికి అకస్మాత్తుగా కలిగిన ధనలాభం వల్ల మరింత గర్వం కలుగుతుంది. ఆ స్థితే చీమకు రెక్కలు రావటం. నడుమంతరపు సిరి వల్ల మిడిసి పడే పరిస్థితి ఇది. "ఆనికి ఇయ్యేడు బావి మంచిదై అందరి పొలాలు ఎండినా వాని ఎకరం పొలం పండిందానికి చీమకు రెక్కలచ్చినట్లు ఆగుతనే లేడు" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూస్తాం.

ఎలుగడి తగిలినట్లు

ఎరగలి వర్ణవ్యత్యయంతో ఎలుగడిగా మారింది. ఎరగలి అంటే కార్చిచ్చు. ఎరగలి వలన గుట్టలన్నీ మంటలతో నిండిపోయి రాత్రుల్లో భూదేవి ముట్టించుకున్న దీపమన్నట్లుగా వెలుగుతాయి. ఇల్లు కాలితే ఊరంతా ఉవ్వెత్తున వచ్చి సాయపడుతారు. కాని గుట్టకు ఎరగలి తగిలితే బుగ్గిగా మిగిలి పోవాల్సిందే తప్ప ఆర్పే వాళ్ళేవరుంటారు. "ఎడ్ల కొట్టంలో గడ్డివాముకు అగ్గి తగిలింది. గుట్టకు ఎలుగడి తగిలినట్లు మొత్తం గడ్డి, కొట్టం, ఎడ్లు తెల్లారే దాకా బూడిదై పోయినయి" అనటంలో ఈ జాతీయం ప్రయోగిస్తారు.

– వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

వెన్నెల వాకిట్లో రసరమ్యగీతాలు

చల్లదనమంటే వెన్నెల, చందమామ, వెండి మబ్బులు, నీలి మేఘాలు, పిల్లగాలి... ఇలాంటివన్నీ గుర్తొస్తాయి. పిల్లలు, పెద్దలనే తేడాలేకుండా వీటిని అందరూ ఎవరి పద్ధతుల్లో వారు ఆస్వాదిస్తారు. చిన్నపిల్లలకు గోరుముద్దలు తినిపించాలంటే చందమామను చూపించాలి. కొంచెం పెద్దయ్యాక ఆరు బయట ఆడుకోవాలంటే జాబిలి నుండి వచ్చే వెండి వెన్నెల కావాలి. ఇంకాస్త పెద్దయ్యాక వెన్నెలను, జాబిలిని చూస్తే కవితాహృదయులకు కవిత్వం వెల్లువెత్తుతుంది. అంతటి గొప్పదనమున్న వీటికి చిత్ర పరిశ్రమలో అగ్రస్థానమే ఉంది. అలనాటి చిత్రాలనుండి నేటి వరకు చందమామ, వెన్నెల, మేఘాలు.. లేని సినిమా లేదు. కనీసం ఒక్క దృశ్యమైనా, పాటైనా ఉండి తీరాల్సిందే. అలాంటి పాటల్లో కొన్ని...

ఎన్టీఆర్, సావిత్రి నటించిన మిస్సమ్మ చిత్రంలోని పింగళి నాగేంద్రరావు రాసిన "రావోయి చందమామ... మా వింతగాథ వినుమా... సామంతము గల సతికీ ధీమంతుడనగు పతినోయ్" పాటలో భార్యాభర్తల అలక ఎంతో అందంగా చూపించారు. ఈ పాటను పి.లీల, ఎ.ఎమ్.రాజా గానం చేశారు.

అక్కినేని, సావిత్రి, గిరిజ నటించిన భలే రాముడు చిత్రంలో "ఓహో.. మేఘమాల... నీలాల మేఘమాల.. చల్లగ రావేలా.. మెల్లగ రావేలా.. మెలమెల్లగా రావేలా..." పి. లీల పాడిన ఈ పాటలో నిదురపోతున్న తన చెల్లికి నిద్రాభంగం చేయొద్దని చల్లగాలి, మేఘాలకు చెప్తుంది. ఇదే పల్లవితో మరో పాటను పి.లీల, ఘంటసాల పాడారు. శ్రీ సదాశివ బ్రహ్మం రాసిన ఈ పాటకు సాలూరి రాజేశ్వరరావు సంగీతం సమకూర్చారు.

ఎన్టీఆర్, సావిత్రి అన్నా చెల్లెళ్ళుగా నటించిన రక్త సంబంధం చిత్రంలో "చందురుని మించు అందమొలికించు ముద్దు పాపాయివే... నిను కన్న వారింట కష్టములనీడ కరగిపోయేనులే" అంటూ విడిపోయిన తమ అనుబంధాన్ని తమ పిల్లల ద్వారా తిరిగి కలవాలని కోరుకుంటారు అన్నాచెల్లెళ్లు. ఘంటసాల సంగీతం అందించిన ఈ పాటను అనిశెట్టి సుబ్బారావు రాశారు. ఘంటసాల, సుశీల పాడారు.

"పగలే వెన్నెలా.. జగమే ఊయల... కదలే ఊహలకే కన్నులుంటే... నింగిలోని చందమామ తొంగి చూసే.. నీటిలోని కలువభామ పొంగిపూచే" పూజాఫలం చిత్రంలో, సి.నారాయణరెడ్డి రచించిన ఈ పాటని జానకి పాడారు. ఇదే పాట తర్వాత కాలంలో సుమన్, సురేష్, లక్ష్మి ప్రధాన పాత్రలతో వచ్చిన 'పరువు ప్రతిష్ఠ' చిత్రంలో ఫాస్ట్‌బీట్‌తో వచ్చింది.

శ్రీశ్రీ రాసిన 'మాంగల్య బలం' చిత్రంలోని "ఆకాశవీధిలో అందాల జాబిలి, వయ్యారి తారను చేరి ఉయ్యాలలూగెనే... సయ్యాటలాడెనే..." పాటను ఘంటసాల, పి.సుశీల పాడారు. మాస్టర్ వేణు సంగీతం అందిచారు.

అక్కినేని, జయలలిత, కృష్ణకుమారి, బేబి శ్రీదేవి నటించిన భార్యా బిడ్డలు చిత్రంలోని "చక్కనైనా చందమామా ఎక్కడున్నావూ... నీవు లేక దిక్కులేని చుక్కలైనాము..." చందమామ మనసులాంటి తమ తండ్రిని వెతుకుతూ పిల్లలు పాడే పాట ఇది.కె.వి.మహదేవన్ సంగీతం అందించిన ఈ పాటను సుశీల, బి.వసంత పాడారు.

ఎన్టీఆర్, కృష్ణకుమారి నటించిన 'లక్షాధికారి' చిత్రంలో "మబ్బులో ఏముంది.. నా మనసులో ఏముంది... మబ్బులో కన్నీరు... నీ మ నసులో పన్నీరు... అవునా... " అంటూ తన మనసులో ఏముందో తన ప్రియుణ్ని అడుగుతుంది. సి.నా.రె రాసిన ఈ పాటకు టి.చలపతిరావు సంగీతం అందించారు. ఘంటసాల, సుశీల పాడారు.

ఏయన్నార్, సావిత్రి నటించిన 'సిరిసంపదలు' చిత్రంలో "ఈ పగలు రేయిగా పండు వెన్నెలగా మారినదేమి చెలీ.. ఆ కారణమేమి చెలీ... వింత కాదు నా చెంత నున్నదీ... వెండి వెన్నెల జాబిలీ... నిండు పున్నమి జాబిలీ..."

భానుచందర్, రజని, భానుప్రియ నటించిన 'మంచి మనసులు' చిత్రంలో జానకి పాడిన "జాబిల్లి కోసం ఆకాశమల్లే వేచాను నీ రాకకై... నిను కానలేక మనసూరుకోక పాడాను నేను పాటనై..." అంటూ ప్రియురాలి కోసం ఎదురు చూస్తూ ప్రియుడు పాడతాడు. ఆత్రేయ రాసిన ఈ పాటకు ఇళయరాజా సంగీతం అందించారు. ఇదే పాట కొంచెం మార్పుతో రెండోసారి కూడా ఉంది.

కృష్ణ, శ్రీదేవి నటించిన 'పచ్చని కాపురం' చిత్రంలో "వెన్నెలైనా చీకటైనా చేరువైనా దూరమైనా నీ తోడే జీవితమూ.. నీ ప్రేమే శాశ్వతమూ" పాటను వేటూరి రాశారు. చక్రవర్తి సంగీత సారథ్యంలో కె.జె.ఏసుదాసు, జానకి పాడారు. ఇదే పాట కృష్ణ అల్లుడు నటించిన ప్రేమ కథా చిత్రంలో కూడా రీ మిక్స్ పాటగా పెట్టారు.

సిరివెన్నెల చిత్రాన్నే తన ఇంటి పేరుగా మార్చుచున్న సీతారామశాస్త్రి రాసిన "చందమామ రావే జాబిల్లి రావే కొండెక్కి రావే గోగుపూలు తేవే" ఈ పాటని పి.సుశీల, బి.వసంత పాడారు. క్షణ క్షణం చిత్రంలో ఎస్.పి.బాలు, చిత్ర పాడిన "జాముురాతిరి జాబిలమ్మ జోలపాడనా ఇలా... జోరు గాలిలో జాజి కొమ్మ జారనీయకే కలా...", మహేశ్వరి, వడ్డే నవీన్ నటించిన పెళ్లి చిత్రంలో "జాబిలమ్మ నీకు అంత కోపమా... జాజిపూలమీద జాలి చూపుమా... ఈ వెండి వెన్నెలే.. ఎండల్లే మండితే.. అల్లాడిపోద రేయి ఆపుమా...", వెంకటేష్, మీనా నటించిన చంటి చిత్రంలో "జాబిలికి వెన్నెలకీ పుట్టిన పున్నమిలే... గంగలలో తేనెలలో కడిగిన ముత్యములే... ముద్దులోనే పొద్దుపోయే, కంటి నిండా నిద్దరోయే" అంటూ చంటి పిల్లలను నిద్రపుచ్చే పాట, మెరుపు కలలు చిత్రంలో "వెన్నెలవే వెన్నెలవే... మిన్నేదాటి వస్తావా? విరహాల జోడీ నీవే....", ప్రేమదేశం చిత్రంలో "వెన్నెలా... వెన్నెలా... మెల్లగా రావే... పూవుల తేనెలే తేవే...", లిటిల్ సోల్జర్స్ చిత్రంలో "ఓ.ఓ... వెండి వెన్నెలా... ఓ.ఓ... దిగిరా ఇలా... అమ్మ కొంగులో చంటిపాపలా.. మబ్బు చాటునే వుంటే ఎలా..", అందాల రాముడులో "జాబిల్లీ రావే వెండి జాబిల్లీ... నీతోనే ఉంటానమ్మా జాబిల్లి", తనీష్, మధురిమ నటించిన మౌనరాగం చిత్రంలో "జాబిలికి వెన్నెలవ్వనా.. తారలకు నింగినవ్వనా...", రామయ్యా వస్తావయ్యా చిత్రంలో "జాబిల్లి నువ్వే చెప్పమ్మా నువ్వే చెప్పమ్మా ఈ పిల్లే వినడం లేదమ్మా... ఓ చుక్కా నువ్వే చూడమ్మా... నీ అక్కని నువ్వే మాట్లాడించమా" లాంటి పాటలన్నీ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేశాయి. మళ్లీ మళ్లీ వినేలా ఆకట్టుకున్నాయి.

- బి. మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

పల్లెలకు ఆదర్శం

ఆ గ్రామం పచ్చదనానికి ఆలవాలం.
ప్లాస్టిక్ కాలుష్యానికి ఆమడదూరం
మద్యానికి స్థానం లేదు
మంచినీళ్ళకు కొదవలేదు.
నూటికి నూరుశాతం అక్షరాస్యత సాధించిన గ్రామం
సమస్యలు ఉండకపోవు, అవి జటిలం కాకముందే
పరిష్కరించుకోగల కమిటీలు అనేకం.
ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వ పథకాల సద్వినియోగం
ఆ గ్రామ పరిపాలనలోని ప్రత్యేక అంశం.
అభివృద్ధికి సంబంధించిన సకల అవకాశాల్ని, నిధుల్ని
అందిపుచ్చుకోడానికి ప్రయత్నించడం ఆ గ్రామ ప్రజల, ప్రజా
ప్రతినిధుల నిబద్ధతకు నిదర్శనం.
ఆ గ్రామం గంగదేవిపల్లి!
ఇప్పుడు జాతీయస్థాయిలో పల్లెలన్నిటికి 'ఆదర్శగ్రామం'గా
నిలిచింది.
ఈ స్థాయిని సాధించడానికి ఆ గ్రామం సాగించిన ప్రయాణపు
తీరుతెన్నుల విశ్లేషణే ఈ వారం ముఖచిత్ర కథనం.

ఇరవై సంవత్సరాల క్రితం అన్ని గ్రామాల మాదిరిగానే గంగదేవిపల్లి కూడా అనేక సమస్యలతో సతమతమయ్యేది. కాని నేడు ఆ గ్రామం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఈ గ్రామం మరెన్నో గ్రామాలకు ఆదర్శ ప్రాయమయ్యింది. ఇటీవల దేశ ప్రధాని జయప్రకాష్‌నారాయణ జన్మదినం సందర్భంగా అక్టోబర్ 11న "సంసార్ ఆదర్శ్ గ్రామ యోజన" అనే పేరుతో ఒక పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద భారతదేశంలో మూడు గ్రామాలను ఆదర్శగ్రామాలుగా కేంద్రం గుర్తించింది. అందులో ఒకటి తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్ జిల్లా, గీసుకొండ మండలం గంగదేవిపల్లి. దీనికి కారణం గ్రామ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం. సిపియం సారథ్యంలో గత 20 సంవత్సరాల నుండి గ్రామ అభివృద్ధికి ప్రజలు చేస్తున్న కృషి, వారిలో ఐక్యమత్యాన్ని నిర్మిస్తూ, ముందుకు నడుపుతున్న స్థానిక సిపియం నాయకులు కూసం రాజమౌళికే దక్కుతుందని గ్రామస్థులు అంటున్నారు.

గ్రామ అభివృద్ధి కోసం 24 కమిటీలు ఏర్పాటు చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం గ్రామంలో వంద శాతం సురక్షిత మంచినీరు, వందశాతం మరుగుదొడ్లు, వందశాతం పరిశుభ్రత, వంద శాతం అక్షరాస్యత సాధించి నేడు ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలిచింది. గంగదేవిపల్లి గ్రామం గతంలో మచ్చాపూర్ పంచాయితీ పరిధిలో ఉండేది. 1995లో గ్రామపంచాయితీగా ఏర్పడింది.

మద్యనిషేధం

ప్రస్తుతం ఈ గ్రామం సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుచేయడంలో ప్రథమ స్థానంలో ఉంది. మద్యనిషేధం కోసం 34 సంవత్సరాల క్రితమే కూసం రాజమౌళి కమిటీని ఏర్పాటు చేశారు. దాదాపు రెండు సంవత్సరాల పాటు మద్యపాన నిషేధంపై ప్రజలలో అవగాహనకల్పించటానికి ప్రయత్నించారు. మొదట్లో ఎవరూ సహకరించలేదు. కమిటీ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన తరగతులను అర్థం చేసుకున్న మహిళలు ఉద్యమానికి నడుం బిగించారు. ఈ ఉద్యమానికి మహిళలు సహకరించినా మగవారు, ముఖ్యంగా దీన్నే వ్యాపారంగా చేసుకున్న వారు వ్యతిరేకించారు. వారిలో ఎంతో సహనంగా మార్పు తీసుకువచ్చారు. మద్యం తయారు చేసే మూడునాలుగు కుటుంబాల వల్ల గ్రామంలోని ఎన్నో కుటుంబాలు నష్టపోతున్నాయని ఎన్నో సార్లు వారికి నచ్చచెప్పారు. దాంతో వ్యాపారులు సహకరించారు. అందరూ కలిసి చివరికి 1982లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసుకున్నారు.

గ్రామంలోని అక్షరాస్యత

50 సంవత్సరాల కంటే చిన్న వయసు ఉన్నవారందరూ వారి పేర్లు రాసుకోగలరు. దీనికి వయోజన విద్యా, అక్షర సంక్రాంతి, నిరంతర విద్య, సాక్షర భారతి ఆధ్వర్యంలో పురుషులను, స్త్రీలను వేరు వేరు గ్రూపులుగా ఏర్పాటు చేశారు. వీరికి చదువు చెప్పటానికి చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చింది. ఇంటింటికి వెళ్ళి వాళ్ళను పిలుచుకురావాల్సి వచ్చేది. వెంటబడి చదువు చెప్పించారు. దీనికి కూడా ఒక కమిటీ ఏర్పాటు చేసి బాధ్యత ఆ కమిటీకి అప్పగించారు. చివరికి అందరికీ విద్యను అందించారు. ప్రస్తుతం చిన్న వయసు పిల్లల నుండి ఇరవై, ముప్పై సంవత్సరాల వయసు వారు అందరూ ఉన్నత చదువులు చదువుకుంటున్నారు. గ్రామంలో తెలుగుమీడియంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలు ఉన్నాయి.

వైద్యం

ఎయన్‌ఎమ్ వారానికి రెండు సార్లు వస్తుంది. పిల్లలకు టీకాలు, గర్భిణీ స్త్రీలకు కావలసిన పరీక్షలు, వారికి కావల్సిన ప్రోటీన్స్, వ్యాక్సీన్లు అందిస్తారు. కొన్ని సమస్యలు ఆరోగ్య కార్యకర్త, అంగన్‌వాడీ కార్యకర్త చూసుకుంటారు. పెద్ద సమస్యలు ఏమైనా వస్తే వరంగల్ 15 కి.మీ

దూరమే కాబట్టి అక్కడికి వెళతారు.

లైబ్రరీ నిర్వహణ

గ్రామంలో పంచాయితీ కార్యాలయ ప్రాంగణంలోనే ఒక లైబ్రరీ ఉంది. బుక్ సెంటర్‌గా దాన్ని నడుపుతున్నారు. ఉన్నత పాఠశాలలో బాలవికాస స్వచ్ఛంద సంస్థ పిల్లల కోసం ఒక లైబ్రరీని ఏర్పాటు చేసుకున్నారు. పాఠశాలకు ఫర్నిచర్ ఆసంస్థవారే ఏర్పాటు చేశారు.

గ్రామంలోని వృత్తులు

చేతివృత్తుల కుటుంబాలు 50 ఉన్నాయి. ఒక్క కుటుంబం మాత్రమే బట్టలు నేస్తారు. మిగిలిన వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటారు. గ్రామంలో నాలుగు కిరాణా షాపులు ఉన్నాయి. ఐదారు కుటుంబాల వారు కుట్టుమిషన్లు నడుపుతున్నారు. పాల వ్యాపారం చేసేవారు 15 నుండి 20 కుటుంబాల వరకు ఉంటాయి. యాదవ కుటుంబాలు 60 వరకు ఉన్నాయి. 10 కుటుంబాలు ఇప్పటికీ గొర్రెలను మేపుకుంటారు. మిగిలిన వారు చిన్న చిన్న వ్యాపారాలు, వ్యవసాయం చేస్తారు. భూమిలేనివారు కూలిపనులు చేసుకుంటారు. కౌలురౌతులు పరిమితంగా ఉన్నారు. గ్రామంలో మొత్తం 406 కుటుంబాలు ఉన్నాయి. 1350 మంది జనాభా ఉంటుంది. కూరగాయలు ఈ గ్రామం నుండి వరంగల్, భద్రాచలం, సిద్దిపేటకు వెళతాయి. పచ్చిమిర్చి, చిక్కుడు, టమోటా ఎక్కువగా పండిస్తారు. గ్రామ ప్రజలకు మొత్తం కలిపి వెయ్యి ఎకరాల భూమి ఉంది.

మహిళా నాయకత్వం

గ్రామ అభివృద్ధిలో ముఖ్య పాత్ర మహిళలది కూడా ఉంది. గ్రామ కమిటీలలో, సర్పంచ్, వార్డునెంబర్లుగా ఎక్కువగా మహిళలే.. 1995లో గ్రామ పంచాయితీ ఏర్పడినప్పుడు సిపియం సహకారంతోనే కూసం లలిత తొలి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. అప్పుడు అన్నివార్డులకు నెంబర్లు కూడా మహిళలే. వీరి పాలన ఎంతో అద్భుతంగా ఉంది. గ్రామం ఎంతో అభివృద్ధి చెందింది. దేశ విదేశాల నుండి ఎంతో మంది వచ్చి గ్రామాన్ని పరిశీలించి వెళుతున్నారు. దాంతో 2001లో ఎన్నికల్లో కూసం లలిత ఆధ్వర్యంలోనే తిరిగి అన్ని వార్డుల్లో మహిళలే గెలుపొందారు. 2006 మూడవసారి ఎన్ని కల సందర్భంలో కూసం రాజమౌళి ఏకగ్రీవంగా సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం నాలుగవ విడతలో ఇట్ల జ్యోతి సర్పంచ్‌గా ఉన్నారు.

గ్రామ పంచాయితీకి వచ్చే నిధులు

2011 వరకు గ్రామ పంచాయితీకి అన్ని రకాలు నిధులు కలుపుకొని 90వేల రూపాయలు వరకు నిధులు వచ్చేవి. గ్రామంలో ఇంటి పన్నులు లక్షా యాభై వేల వరకు వసూలు చేస్తారు. ప్రతి సంవత్సరం నవంబర్ చివరి నాటికల్లా ఇంటి పన్నులు కచ్చితంగా వంద శాతం వసూలు చేస్తారు. ఇంటి పన్నులు, నీటి పన్నుల నుండి వచ్చే నిధులను వేతనాలు, వీధిలైట్లు, పారిశుద్ధ్యానికి ఉపయోగిస్తారు. మిగిలిన అభివృద్ధి పనులకు ఈ నిధులను ఉపయోగించరు.

మంచినీటి నిర్వహణ కమిటి

అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన అన్ని కమిటీల కంటే మంచినీటి నిర్వహణ కమిటీ పాత్ర చాలా కీలకమైంది. గ్రామ అభివృద్ధికి అవసరమైన ఎక్కువ శాతం నిధులు ఈ కమిటీ ద్వారానే సమకూర్చుకుంటారు. గతంలో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రజలు ఫ్లోరిడ్ నీరు తాగి అనారోగ్యాల బారినపడేవారు. దాంతో గ్రామంలో సురక్షిత మంచి నీటి కల్పన లక్ష్యంగా భావించారు. పల్లె గ్రామ పంచాయితీగా ఏర్పడక ముందే 1990లో రాజమౌళి అప్పటికే అనేక గ్రామాలకు మంచి నీటి సౌకర్యం కల్పిస్తున్న బాలవికాస స్వచ్ఛంద సంస్థ సహకారం కోరారు. వారు గ్రామాన్ని సందర్శించి 15 శాతం నిధులు గ్రామ ప్రజలు సమకూర్చుకుంటే మిగిలిన నిధులు వారు సమకూర్చి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. 1993లో ఈ స్వచ్ఛంద సంస్థ 90వేల లీటర్ల మొదటి ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఐతే వీరు దీనికి కొన్ని నిబంధనలు

ముందే అవగాహన కల్పించాం

మా గ్రామం ఆదర్శ గ్రామంగా ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. గ్రామంలో ఎటువంటి సమస్యలు లేవు. ప్రతి కమిటీలో మహిళలు 50శాతం ఉంటారు. మా గ్రామ పెద్దలు మాకు బాగా సహకరిస్తారు. మహిళలను ముందుకు తీసుకు రావటానికి అందరూ కృషి చేస్తారు. సారాయి, బెల్టు షాపులు లేకుండా చూడడం మా కమిటీ పని. ముందే ప్రజల్లో తాగుడు వల్ల నష్టాలను తెల్పి అవగాహన కల్పించి మద్యాన్ని నిషేధించాం. కాబట్టి ఇప్పటి వరకు నిబంధనలను ఉల్లంఘించలేదు. గ్రామ పరిధిలో ఎవరూ తాగరు. బయట తాగివచ్చినా గ్రామంలో, ఇంట్లో ఏదైనా గొడవ చేస్తే తరువాత రోజు గ్రామ పెద్దల్లో నిలబెట్టి కచ్చితంగా మందలిస్తారు. కాబట్టి వంద శాతం ఎవరూ గొడవలు చేయరు. అందరం కలిసి సమిష్టి నిర్ణయాలు తీసుకుంటాం. కమ్యూనిటీ హాల్‌లో మా మీటింగ్‌లు జరుపుకుంటాం. సమావేశం రోజు మైక్‌లో ప్రచారం చేస్తారు. మేమందరం సమయానికి వచ్చేస్తాం.

– సింగిరెడ్డి జ్యోతి, మద్యనిషేధ కమిటీ అధ్యక్షులు

డ్వాక్రా సంఘాల పనితీరు

గత మూడు సంవత్సరాలనుండి నేను ఈ బాధ్యతలో ఉన్నాను. మా సంఘంలో 15 మంది సభ్యులు ఉంటారు. ఇందులో ఇద్దరు లీడర్లను ఎంపిక చేస్తాం. వారు అధ్యక్ష, కార్యదర్శులు ఉంటారు. వీటి అధ్యక్షురాలు గ్రామైఖ్య సంఘానికి ఈసి సభ్యురాలుగా ఉంటుంది. ప్రతినెలా 12వ తేది చిన్న సంఘాలు,పెద్ద సంఘాల పనితీరుపై సమావేశాలు జరుపుకుంటాం. మొత్తం 22 సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం నుండి వచ్చే అభయహస్తం, పిల్లల స్కాలర్‌షిప్, ఇన్సురెన్స్ లాంటివన్నీ చర్చించుకుంటాం. పిల్లల చదువుల కోసం, వ్యవసాయానికి, కుట్టుమిషన్లకు, గేదెల కోసం డ్వాక్రా లోన్లను ఉపయోగించుకుంటారు.

రోజుకు పిడికెడు బియ్యం : మా సంఘాల్లో మొత్తం 320 మంది సభ్యులు ఉంటారు. ప్రతి సభ్యురాలు ప్రతిరోజూ వారు వండుకోవటానికి తీసిన బియ్యం నుండి పిడికెడు బియ్యం తీసి దాస్తారు. అలా నెలకు వారు దాచిన బియ్యం రెండు కిలోలు అవుతాయి. ప్రతి సభ్యురాలు దాచిన బియ్యం మొత్తం కలిపి నెలకు 40 కిలోలు. ఇవన్నీ గ్రామైఖ్య సంఘానికి తీసుకువస్తారు. ఆ బియ్యాన్ని అమ్మి ప్రతి నెలా అనాథ పిల్లలను, వృద్ధులను, వికలాంగ పిల్లలను మా గ్రామానికి పిలిచి ఆ డబ్బును వారికి సహాయంగా అందిస్తాం. మేము చేస్తున్న ఈ కార్యక్రమాన్ని చూసి గ్రామంలోని మిగిలిన ప్రజలు వ్యక్తిగతంగా కూడా వారికి సహాయం అందిస్తారు.

– గూడా సరోజమ్మ,

చిన్న సంఘాల, గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు

వచ్చిన అవార్డులివి

1996-97: మండల స్థాయిలో ప్రథమ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు

1997-98: మండల స్థాయిలో ప్రథమ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు

1997-98: జిల్లాస్థాయిలో ప్రథమ ఉత్తమం గ్రామపంచాయితీ అవార్డు

30.03.99: వంద శాతం కుటుంబాలు చిన్నమొత్తాల పొదుపు చేసినందుకు జిల్లాస్థాయిలో అవార్డు

2003-04: జిల్లాస్థాయిలో ప్రథమ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు

2006-07: జిల్లాస్థాయిలో ప్రథమ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు

2006-07: ఎల్ఐసి వరంగల్ వారిచే బీమీగ్రాం అవార్డు

04.05.2007: భారత రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం గారిచే అత్యంత ప్రతిష్టాత్మమైన "నిర్మలా గ్రామ పురస్కార్"

20.08.2007: "భారతరత్న రాజీవ్‌గాంధీ" అత్యుత్తమ గ్రామపంచాయితీగా జాతీయస్థాయి అవార్డు కేరళ గవర్నర్ ఆర్ఎల్ భాటియా నుంచి

2007-08: : జిల్లాస్థాయిలో ప్రథమ ఉత్తమ గ్రామపంచాయితీ అవార్డు

2008: సంపూర్ణ పారిశుధ్యంలో జిల్లాలేనే మొదటిగ్రామంగా "శుభ్రం" అవార్డు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేకర్‌రెడ్డి అందించారు.

2009: సర్పంచ్, గ్రామపంచాయితీ కార్యదర్శి విధి నిర్వహణలో చేసిన ప్రశంసనీయ సేవలకు గుర్తింపుగా అవార్డు

2010లో ప్రతిష్టాత్మకమైన గూగుల్ అవార్డు సైతం వచ్చింది.

గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యంగా ఉన్న కమిటీలు

1.వృత్తిదారుల సమన్వయ కమిటీ, 2. ప్లాస్టిక్ నివారణ కమిటీ, 3. రైతు వికాస సంఘం, 4. చైతన్య శిక్షణా కమిటీ, 5. పాఠశాల కమిటీ, 6. గ్రామైక్య కమిటీ, 7. తల్లుల కమిటీ, 8. పచ్చదనం పరిశుభ్ర కమిటీ, 9. పౌరసరఫరాల కమిటీ, 10. యువజన కమిటీ, 11. మహిళా అభివృద్ధి కమిటీ, 12. వీధి లైట్ల నిర్వహణ-ప్రజాసమస్యల పరిష్కార కమిటీ, 13. గంగా డిష్ కమిటీ, 14. ఆరోగ్య కమిటీ, 15. మద్యనిషే కమిటీ, 16. ఇంటర్నల్ ఆడిట్ కమిటీ, 17. పారిశుద్ధ్య కమిటీ, 18. మహిళా సమస్యల పరిష్కార కమిటీ, 19. మంచి నీటి నిర్వహణ కమిటీ, 20. సమన్వయ కమిటీ (గ్రామంలోని అన్ని కమిటీలో నాయకత్వంతో), 21. లోన్స్ రికవరీ కమిటీ, 22. గ్రామ అభివృద్ధి కమిటీ, 23. పాలనా కమిటీ, 24. గ్రామ పంచాయితీ కమిటీ.

పెట్టారు. నీరు వృధాగా పోకూడదు. ఆ తరువాత గ్రామ అభివృది, నీటి ఉపయోగాన్ని గమనించిన సంస్థ వారు 1998లో లక్షా పదివేల లీటర్ల రెండో ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మించారు. ఈ నీటిని అనవసరంగా వృధా చేయకుండా ఉండాలని మంచినీటి నిర్వహణ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రతినెలా మూడవ తేది సమావేశం అవుతుంది. గ్రామంలోని అన్ని కమిటీలు ప్రజల రోజువారి పనులకు ఆటంకం లేకండా రాత్రి ఎనిమిది గంటల తరువాతనే జరుగుతాయి. నీటి కమిటీ లక్షల్లో వ్యవహారం కాబట్టి ఈ కమిటీ సమావేశాలు ఒక్కొక్క సారి తెల్లవారు జాము వరకు కూడా జరుపుకుంటారు.

నీటి వినియోగంపై కొన్ని నిబంధనలు

★ నల్లాపైపు 1/2 ఇంచు మాత్రమే ఉండాలి.

★ భూమి లెవల్ నుంచి నల్లా నాలుగుఫీట్ల ఎత్తులో ఉండాలి.

★ నల్లాకు ఆన్, ఆఫ్ కచ్చితంగా ఉండాలి.

★ ట్యాంక్ ఏర్పాటు చేసుకొని ఎన్ని నీళ్ళయినా పట్టుకోవచ్చు. కాని కింద పొర్లిపోకూడదు.

★ మొక్కలకు నీరు నల్లాపైపుకు ట్యూబ్ పెట్టి పట్టకూడదు. బకెట్లతోనే మొక్కలకు నీరు పోయాలి.

పైపుతో మొక్కలకు నీరు పడితే ఫైన్ కట్టాలి.

ఈ మంచి నీటి కమిటీ గ్రామ అభివృద్ధిలో పూర్తి బాధ్యత వహిస్తుంది. గ్రామ పంచాయితీకి సమానంగా ఈ కమిటి పనిచేస్తుంది. నల్లా వినియోగ దారులు కొత్త వారికి కనెక్షన్ ఇచ్చినపుడు డిపాజిట్ రూపంలో డబ్బు వస్తుంది. గ్రామంలో నెలవారి నీటి పన్ను ఉండదు. సంవత్సరానికి ఒకేసారి కట్టించుకుంటారు. నల్లా కనెక్షన్లు వచ్చిన కొత్తలో పెట్టించుకున్న వారు 1000 రూపాయలు చెల్లిచారు. ప్రస్తుతం కొత్త నల్లా కనెక్షన్ కావాలంటే 6000 రూపాయలు చెల్లించాలి. ఎవరైనా నిబంధనల ప్రకారమే కనెక్షన్ పెట్టించుకోవాలి, నీటిని వాడుకోవాలి. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల నుండి పదకొండు గంటల వరకు నీటి సరఫరా జరుగుతుంది.

కూసం రాజమౌళి

పచ్చదనం పరిశుభ్రత

ప్రతి కుటుంబం ఒక మొక్క పెంచాలని మంచినీటి కమిటీ నిర్ణయించింది. దీనికి గాను ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. మొక్కలను బాలవికాస వారు ఏర్పాటు చేశారు. వీటికి రక్షణ కోసం కావల్సిన గ్రిల్స్‌ను మంచినీటి కమిటీ ఏర్పాటు చేసింది. ప్రతి శని, మంగళవారాలు మొక్కకు నీళ్ళు పోయాలి. యజమాని నీళ్ళు పోశాడా లేదా అనేది ఆ కమిటీ పరిశీలిస్తుంది. నీళ్ళు పోసిన వారికి ఒక స్లిప్ ఇస్తారు. ఆ స్లిప్ చూపించి ఆ రెండు రోజులు ప్యూర్‌ఫైర్ వాటర్ క్యాన్ వారికి ఇస్తారు. మిగిలిన రోజుల్లో స్లిప్ అవసరం లేదు. ఇటువంటి నిబంధనలతోటి పచ్చదనం పరిశుభ్రతను గ్రామంలో అమలు చేస్తున్నారు.

ప్యూర్‌ఫైర్ వాటర్ రూపాయికి ఇరవై లీటర్లు

గ్రామంలో ప్రజలకు సురక్షిత మంచినీరు అందించాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్యూర్‌ఫైర్ వాటర్ పద్దతిని అమలు చేస్తున్నారు. గ్రామంలో ప్రతి ఇంటికి రూపాయికే ఇరవై లీటర్ల ప్యూర్‌ఫైర్ వాటర్ అందిస్తున్నారు. ఈ మంచినీటి అమలును చూసిన ఆంధ్రబ్యాంక్ చైర్మన్ రామకృష్ణన్ గ్రామానికి వెటర్నటీ ఆసుపత్రి ఏర్పాటు చేసుకోవటానికి ఐదు లక్షల రూపాయాలు విరాళంగా ఇచ్చారు. దానికి కావల్సిన స్థలాన్ని మంచినీటి కమిటీ కొనుగోలు చేసింది. ప్రతి సంవత్సరం జనవరిలో త్రాగునీటి కోసం 364 రూపాయలు ప్రతి ఇంటినుండి కట్టించుకుంటారు. సంవత్సరం పాటు ప్రతి ఇంటికి రోజూ ఒక్కరూపాయికి ఇరవై లీటర్ల సురక్షిత మంచి నీటిని అందిస్తున్నారు. మూడు నాలుగు రోజులు నీటిని ఒకే రోజు ఇవ్వమంటే ఇవ్వరు. రోజుకు ఒకే క్యాన్ ఇస్తారు. అదనంగా మరో ఇరవైలీటర్లు కావాలంటే దానికి 4 రూపాయలు చెల్లించాలి. బయట గ్రామాలనుండి కూడా వచ్చి మంచినీటిని తీసుకుపోతారు. వారికి కూడా ఇరవై లీటర్లు 4రూపాయాలకు ఇస్తారు. దీనికి వచ్చే ఆదాయంతో వేతనాలకు పోను ఇంకా గ్రామ అభివృద్ధికి మంచినీటి కమిటి నిధులు అందిస్తుంది. గ్రామంలో నిర్వహిస్తున్న సురక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించటానికి దేశవిదేశాలనుండి ఎంతో మంది వచ్చారు.

ట్రైనింగ్ సెంటర్ భవనానికి సహకారం

ఈ గ్రామం ఆదర్శ గ్రామంగా ఉంది దీనిని సందర్శించటానికి అనేక మంది వస్తున్నారు. కాబట్టి ఒక ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని అపార్డ్‌వారు 50 లక్షల విలువ చేసే భవనాన్ని నిర్మించి ఇచ్చారు. ఈ భవన నిర్మాణం కోసం మంచినీటి కమిటినే 30లక్షల విలువ కలిగిన భూమిని రిజిస్ట్రేషన్ చేయించింది. ఈ భవనంలో ప్రజాప్రతినిధులు, వార్డు మెంబర్లు, జెడ్‌పిటిసిలు, ఎంపిటిసిలు, డ్వాక్రా లీడర్లకు, ఉపాధి హామీ పథకానికి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లుకు శిక్షణ ఇస్తారు. ఐతే ఇంకా దానికి ఫర్నిచర్ ఇవ్వలేదు. ప్రస్తుతం అందులో ట్రైనింగ్ ప్రారంభించలేదు. గ్రామపంచాయితీ అవరణలోని హాల్‌లోనే ప్రస్తుతం మీటింగ్‌లు జరుగుతున్నాయి.

వందశాతం మరుగుదొడ్లు

1999లో అప్పటి కమిషనర్, కలెక్టర్ గ్రామానికి వచ్చి వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకుంటే ప్రతి కుటుంబానికి 2000 రూపాయలు గవర్నమెంట్ ఇస్తామన్నారు. అలాగే 500 రూపాయలు బెన్‌ఫిషర్ ఇస్తామన్నారు. ఇదేకాక ఈ గ్రామంలో 2000 సంవత్సరం, జనవరి 26వ తేదీకల్లా వందశాతం మరుగుదొడ్లు నిర్మించుకుంటే గ్రామ అభివృద్ధికి ప్రోత్సాహక బహుమతి పది లక్షలు ప్రకటించారు. వెంటనే ప్రజలతో చర్చించారు. అందరూ సిద్ధమయ్యారు. అప్పుడే మరుగుదొడ్ల నిర్మాణ కమిటీ ప్రారంభించారు. గ్రామంలో కాస్త పలుకుబడి ఉన్న వారిని ఉపయోగించుకొని ఇసుక, రాయి, రింగులు, మేస్త్రీలను ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ కమిటీ ఆధ్వర్యంలోనే జరిగాయి. ఐతే గ్రామంలోని కొంత మంది ఈ వందశాతం మరుగుదొడ్ల కార్యక్రమానికి సహకరించలేదు. చివరికి మరుగుదొడ్లులేని కుటుంబాలు గ్రామంలో 30 మిగిలాయి. మరుగుదొడ్ల నిర్మాణ కమిటి ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు 30 మంది సభ్యులు బాధ్యత తీసుకొని వారితో ఒప్పించి మరుగుదొడ్లు నిర్మించారు. చివరికి 2000 జనవరి 26 నాటికి వందశాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేశారు.

మరుగుదొడ్ల ఉపయోగానికి ఒక యుద్ధం

వందశాతం మరుగుదొడ్లు నిర్మాణం ఒక పోరాటంలా జరిగింది. ఐతే కట్టించిన వాటిని ఉపయోగించే విధంగా చేయడానికి కూడా పోరాటమే జరిగింది. చాలా మంది మలవిసర్జన కొరకు బయటకు వెళ్ళేవారు. మరుగుదొడ్ల కమిటీ వారు రోజూ ఉదయం గ్రామ చివర్లో కాపలా కాసేవారు. ఎవరైతే మలవిసర్జనకు బయటకి వస్తారో వారిని పట్టుకునేవారు. వారికి అవగాహనా తరగతులు ఏర్పాటు చేసేవారు. చివరికి మరుగుదొడ్డి ఉపయోగించని వారికి అపరాధ రుసుం నిర్ణయించారు. ఇలా చేయడంతో చివరికి మరుగుదొడ్ల ఉపయోగం విజయవంతం అయింది.

అపరాధ రుసం విధిస్తారు

గ్రామ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన 24 కమిటీలు నిర్ణయించిన నిబంధనలను గ్రామంలో ఎవరైనా అమలు చేయకపోతే ఆయా కమిటీలకు ప్రజలు అపరాధరుసం చెల్లించవలసి ఉంటుంది.

★ మంచినీటి కమిటీ నిబంధనలు ఉల్లంఘిస్తే వంద రూపాయలు

★ బహిరంగ మల విసర్జనకు ఐదు వందల రూపాయాలు

★ రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లు నరికితే మూడు వేలు

★ అనుమతి లేకుండా బ్యానర్లు కడితే నోటీసుపంపి చర్యలు తీసుకుంటారు.

★ కమిటీలలో ఉన్న సభ్యులు అనుమతి లేకుండా సమావేశానికి హాజరు కాకపోతే వంద రూపాయలు

అపరాధ రుసం ద్వారా వచ్చిన ఈ డబ్బును ఆయా కమిటీల వద్ద ఉంచి గ్రామ అభివృద్ధి కోసం ఉపయోగిస్తారు. వాటికి సంబంధించిన జమా ఖర్చులను లెక్కలు చూపించవలసి ఉంటుంది.

- ఎస్.కె.సలీమ, 9490099083

నా బాధ్యతలు పెరిగాయి

నేను సర్పంచ్‌గా ఉండగా ఆదర్శగ్రామంగా ఎన్నిక కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. మా గ్రామ ప్రజల ఐక్యతే దీనికి కారణం. గతంలో నాకు రాజకీయాల గురించి తెలియదు. ఈ గ్రామానికి వచ్చిన తరువాతే తెలుసుకున్నాను. మా అమ్మ గారిది ఖమ్మం జిల్లా. నాకు వివాహమైన తరువాత ఈ గ్రామానికి వచ్చాను. వివాహమై 15సంవత్సరాలు అవుతుంది. ఏ పనైనా అందరం కలిసే నిర్ణయించుకుంటాం. ఇంట్లో ఉంటూ మిషన్ కుట్టుకునేదాన్ని. ఆరవతరగతి వరకు చదువుకున్నాను. గ్రామంలో మహిళా సంఘంలో, డ్వాక్రా సంఘంలో పనిచేసేదాన్ని. దాంతో గ్రామంలో ముఖ్యమైన కమిటీ అయిన మంచి నీటి కమిటీలో సభ్యురాలుగా ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఎన్నో విషయాలు నేర్చుకున్నాను. వీటిలో కాస్త ఉత్సాహంగా పనిచేయడం గమనించిన గ్రామ పెద్దలు ఎస్.టి ఉమెన్ రిజర్వేషన్ కావడంతో నన్ను సర్పంచ్‌గా పోటీ చేయమన్నారు. ఎన్నికల్లో గ్రామ ప్రజలందరూ నాకెంతో సహకరించారు. ప్రస్తుతం నాపై బాధ్యతలు పెరిగాయి. ఆదర్శ గ్రామంగా ఎన్నికయ్యింది. దీన్ని కాపాడుకోవల్సిన బాధ్యత ఉంది. కాబట్టి అవైపే నా దృష్టిపెట్టాలని అనుకుంటున్నాను.

కలెక్టర్ హామీ ఇచ్చారు :గ్రామంలో ఇంగ్లీషు మీడియం పాఠశాల వెంటనే ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామంలో వ్యవసాయం చేసుకునే వారు ఎక్కువగా ఉన్నారు. కాబట్టి వారికి నీటి సౌకర్యం కోసం ఉపాధి హామీ పథకం ద్వారా వాటర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు చేస్తామన్నారు. దీని ద్వారా వర్షపు నీటిని ఎక్కువగా నిల్వచేసుకునే అవకాశం దొరుకుతుంది. గ్రామానికి దగ్గరలో నాలుగు గ్రామాలకు అతిత్వరగా చేరుకోవటానికి అవసరమైన లింక్ రోడ్లు నిర్మిస్తామన్నారు. అలాగే గ్రామంలో ఇంటర్‌నల్(గల్లీల్లో) మెటల్ రోడ్లకి నిధులు మంజూరు చేస్తామన్నారు. అలాగే ట్రైనింగ్ భవనానికి ప్రహరీగోడతో పాటు, ఆగిపోయిన పనులు పూర్తిచేస్తామన్నారు.

- ఇట్ల శాంతి

బాలవికాస సహకారం ఉంది

మా గ్రామంలో గతంలో ఒకే ఒక బావి ఉండేది. ఆ బావి దగ్గర నీటి కోసం ఆడవాళ్ళు కొట్టుకోవల్సి వచ్చేది. ఆ సమయంలో బాలవికాస వాళ్ళు మా గ్రామానికి రెండు వాటర్ ట్యాంక్‌లు నిర్మించి పెట్టారు. నీటి వినియోగం గురించి నీటి కమిటి కొన్ని నిబంధనలు పెట్టింది. ఆ నిబంధనలను గ్రామ ప్రజలు అమలు చేస్తున్నారో లేదోనని నీటి కమిటీ సభ్యులు ప్రతీ ఆరునెలలకు ఒక సారి వెళ్ళి చెకింగ్ చేస్తారు. ఈ నిబంధనల విషయంలో ప్రజలు ఏదైనా పొరపాటు చేస్తే కమిటీకి అపరాధరుసం విధిస్తుంది. ప్రతి రోజూ మంచినీరు ప్రతి కుటుంబానికి చేరే విధంగా కమిటి చూస్తుంది.

- చల్ల మల్లయ్య, మంచినీటి కమిటీ మాజీ అధ్యక్షులు

■ఎరుక : మునిమడుగుల రాజారావు

నదులన్నీ సముద్రం వైపే పరుగులు తీస్తూ ప్రవహిస్తూ ఉంటాయి. ఎందుకనీ...? ఎన్నెన్ని ఆనకట్టలు కట్టినా కూడా ప్రత్యామ్నాయ దారుల్ని వెతుక్కుని మళ్లీ సముద్రం వైపే పయనమవుతూ ఉంటాయి. ఎందుకనీ...? కొండ చరియల్ని చీల్చుకుంటూ, లోయల్లోంచి పడుతూ లేస్తూ చివరగా సముద్రాన్నే చేరుకుంటాయి. ఎందుకనీ...?

ఎందుకంటే- నదులన్నీ సముద్రంలోంచే వచ్చాయి కాబట్టి. నదులన్నింటికీ సముద్రమే తల్లిగారి ఇల్లు కాబట్టి. అలల చేతులు సాచి సముద్రమే తల్లిలా నదుల బిడ్డలనన్నింటినీ తన ఒడిలోకి రా రమ్మని పిలుస్తూ ఉంటుంది కాబట్టి.

ఈ ప్రపంచంలోని మనుష్యులంతా ఆనందం వైపే పరుగులు తీస్తూ పయనిస్తూ ఉంటారు. ఎందుకనీ...? తమ సంపాదన, కీర్తి ప్రతిష్ఠల కోసమై పడే ఆరాటం అంతా కూడా ఆనందం కోసమే అనీ అంటారు. తాము, చేపట్టే ప్రతీ పని అంతిమ లక్ష్యం ఆనందం కోసమేననీ ప్రకటిస్తూ ఉంటారు... ఎందుకనీ...?

ఎందుకంటే – ప్రపంచంలోని ప్రతి మనిషి ఆనందంలోంచే వచ్చాడు కాబట్టి. ఆనంద క్షేత్రమే, బ్రహ్మానంద జగత్తే ప్రతీ మనిషి తల్లిగారి ఇల్లు కాబట్టి.

వెలగడం ధ్యానం ప్రాథమిక ప్రామాణిక సూత్రం. ఆనందంలో ముంచటం దాని అంతిమ లక్ష్యం. తొమ్మిది నెలల కాలంలో ధ్యానంలో విచ్చుకునే శిశువు తల్లి గర్భాన వెలుగులోనూ, ఆనందంలోనూ ఈదులాడుతూ ఉంటాడు. తల్లి గర్భాన శిశువుకి చీకటనేదే లేదు. అక్కడ ఒక “అఖండమైన వెలుగు” వెలుగు లీనుతూ ఉంటుంది. అవ్యక్తమైన బ్రహ్మానందం అక్కడ ప్రవహిస్తూ ఉంటుంది.

అయితే అవి శిశువుకి అపరిచయాలే. (చీకటి పరిచయం కానంతవరకూ వెలుగులోనే ఉన్నప్పటికీ వెలుగు పరిచయం కాదు). అయినప్పటికీ వాటి ప్రభావం శిశువుపై ఎంతో ఉంటుంది. అందుకనే బాల్యంలో ‘ఆనందం’ బాల్యపు చివరి అంచులదాకా రాజ్యమేలుతూ ఉంటుంది. అందుకనే బాల్యంలో ముఖవర్చస్సు ఒక వెలుగు వెలుగుతూ ఉంటుంది. వసంతానికి వర్షానికి ఎలాంటి సంబంధం లేనట్లే బాల్యంలో పేదరికానికి ఆనందానికి ఎలాంటి సంబంధం లేదు. ఎంతటి పేదరికంలో పుట్టినా సరే బాల్యంలో మనిషి ఆనందాన్ని వెతుక్కుంటూ వెళ్లిన దాఖలాలు లేవు. ఎందుకంటే (బాల్యంలో) అతను ఉన్న స్థితే ఆనందం. ఆనందం అక్కడే, అతనితోనే ఉన్నపుడు మళ్లీ కొత్తగా ఆనందాన్ని వెతుక్కోవాల్సిన అవసరం ఏముంటుంది? వెలుగులోనే ఉన్నటువంటి ఎవరైనా అదే క్షణంలో మళ్లీ వెలుగుని వెతుక్కుంటారా?

చీకట్లో ఉన్నప్పుడే వెలుగు కావాలనిపిస్తుంది. అనారోగ్యంతో ఉన్నప్పుడే ఆరోగ్యం స్పృహలోకి వస్తుంది. ఆనందం లేనప్పుడే ఆనందం కావాలనిపిస్తుంది.

బాల్యం మెల్లగా మెల్లగా కరిగిపోతూ ఉన్న క్రమంలో ఆనందమూ కరిగిపోతూ ఉంటుంది. అంటే బాల్యం నుండి విడిపోయిన మనిషి దుఃఖంలోకి అడుగు పెడతాడన్నమాట. దుఃఖం అంటే ఏమిటి? ఆనందం లేకుండా ఉండటం, శాంతి లేకుండా ఉండటం. ప్రతి చిన్న విషయానికీ చిరాకుపడుతూ ఉండటం. అసహనాన్ని ప్రకటిస్తూ ఉండటం... ఇంకా...ఇంకా...

మనిషితోనే వచ్చిన ఆనందం, అతడు విచ్చుకునేందుకు ఎంతో ఉపయోగపడిన ఆనందం, ఇపుడు ఎటు పోయినట్లు? ఎక్కడ దాక్కున్నట్లు? అది ఎటూ పోలేదు. ఎక్కడా దాక్కోనూ లేదు. అది ఉన్నచోటే ఉంది. అయితే కప్పబడి ఉంది. అది తెలియకే మనిషి ఆనందాన్ని బయట వెతుకుతూ ఉంటాడు. బయట వెతకడం అంటే ‘భౌతికంలో’ వెతకడం. ‘ఆనందం భౌతికం కాదు. భౌతికంలో వెతికేది ఆలోచనే. ఆలోచనతో ఆనందాన్ని వెతికి దానిని చేరగలమా? ఆలోచన ఆనందాన్ని తయారు చేయగలదా? ఆలోచన దుఃఖాన్ని తయారు చేయగలదు కాని ఆనందాన్ని కాదు. అది దాని వలన కాని పని.

‘వర్తమానం’ ఆనందపు ఆవరణ

ఎందుకంటే ఆలోచనే ఆనందానికి పూర్తిగా వ్యతిరేకమైనది. ఆలోచనని ప్రవహించనీయడమంటే ఆనందాన్ని వద్దనుకోవడమే. తెల్లని కాగితంపై నల్లని పెన్సిల్తో గీతలు గీసి తెలుపుని అగుపడనీయకుండా చేయడం లాంటిది. నల్లని పెన్సిల్ గీతలతో ఎంత దూరం ప్రయాణించినా తెలుపు అనేది నలుపు అవుతూనే ఉంటుంది కాని తెలుపు కాదు. నలుపుని తెలుపు తినేయాలి. కర్మాగారంలోంచి పుట్టుకతోనే తెలుపు రంగులో వచ్చిన కాగితం మళ్లీ తెలుపు రంగులో అగుపడాలంటే పెన్సిల్ గీతలు మాయమవ్వాలి. అందుకే మరో తెలుపు గీతలు గీసే పెన్సిల్ కావాలి. అది నుండి పునాదిగా ఉన్నటువంటి ఆనందం అనుభవంలోకి రావాలంటే ఆలోచన గీతలు మాయమవ్వాలి. అయితే దానికి ఎంతో ఎరుక కావాలి లేదా అపారమైన ఆత్మజ్ఞానం కావాలి లేదా ఆలోచనే ఆలోచననీ మింగాలి. అప్పుడు మిగిలేది అనాలోచన ఆవరణయే. అనాలోచన ఆవరణే ఆనందం. అందుకే ధ్యానంలో ఆలోచన లేకుండా ఉండమంటారు. ఎందుకనీ? ఆరోగ్యం కోసం. డాక్టర్లు రోగికి వైద్యం చేసాక ఎలాంటి ఆలోచన లేకుండా పూర్తి విశ్రాంతిలో ఉండమంటారు. ఎందుకనీ? ఆరోగ్యం కోసం. (ఆరోగ్యం ఆనందం కొమ్మ) అయితే ఆలోచన–దాని స్థానం, దాని విలువ, ప్రాపంచికంగా దాని గౌరవం దానికి కచ్చితంగా ఉన్నాయి. అది లేకుండా మనిషి మనుగడ లేదు. ఆలోచనతో ఉండటమంటే గతంతో ఉండటం లేదా భవిష్యత్తుతో ఉండటం. కాని ఆనందంగా ఉండటమంటే వర్తమానంతో ఉండటం. అందరూ ఆనందంగా ఉండాలి. అవసరం ఏర్పడినప్పుడు (మాత్రమే) ఆలోచననీ ఉపయోగించుకోవాలి.

రచయిత సెల్ :9493430130

అబద్ధాలాడినందకు...

మొదటి వివాహ వార్షికోత్సవ సందర్భంలో భార్య భర్తను అడిగింది: నన్ను పెళ్ళి చేసుకొని మీరెలా ఫీలవుతున్నారండి?

భర్త: వంద అబద్ధాలాడి ఒకపెళ్ళి చెయ్యమని ఎవరు అన్నారో కానీ, ఆయన కనిపిస్తే చంపేయాలని వుంది.

భార్య: పాపం, ఆయనేం చేశారండి!

భర్త: ఆయన మాటలు మీ నాన్న అక్షరాలా పాటించి, నిన్ను నాకు అంటగట్టారు కదా, అందుకని.

బందీలు

సైనికులకు శిక్షణ ఇస్తున్నాడు ఒక అధికారి. శిక్షణలో భాగంగా ఒక బిస్కెట్ల డబ్బాను ఒక టేబుల్‌పై పెట్టి –

"మీరు శత్రుసేనలపై పడినట్లుగా ఈ బిస్కెట్ల డబ్బాపై పడి అందరూ తీసుకొని తినండి" అన్నాడు.

వారిలో ఒక యువకుడు కొన్ని బిస్కెట్లు జేబులో వేసుకోవడం చూసిన అధికారి–

"అలా జేబులో వేసుకోవడం తప్పు. ఇక్కడే తీసుకొని తినాలి" అని చెప్పాడు.

"లేదు సార్! నేను కొంతమంది శత్రువులను బందీలుగా పట్టుకున్నాను, పారిపోకూడదని" అన్నాడు గంభీరంగా.

పనిచేయడానికి వచ్చిన రోజు



మాధవరావు తన నాలుగేళ్ళ కూతురికి 'పెళ్ళిరోజు' అనే భావనను అర్థమయ్యేలా వివరించలేకపోతున్నారు. చివరికో ఐడియా వచ్చింది. బీరువాలోంచి తమ పెళ్ళి ఫొటోల ఆల్బమ్ తీసి చూపించి "అది ఇలా, ఇది ఇలాగ" అంటూ చెప్పి, "ఇప్పుడు తెలిసిందా పెళ్ళిరోజు అంటే ఏమిటో" అన్నారు.

"ఊ... తెలిసింది, మమ్మీ మనింట్లో పనిచేయడానికి వచ్చిన రోజుకదా" అందా చిన్నారి.

పెళ్ళి సంబంధం

భర్త: మీ తల్లీకూతుళ్ళు వచ్చిన ప్రతి సంబంధానికి ఏదో ఒక పెడుతున్నారు. ఇప్పుడు వచ్చిన సంబంధం కుదరకపోతే ఎనిమిది అంతస్తుల భవనం మీద నుంచి కిందకు దూకి చచ్చిపోతాను

భార్య: మన ఊళ్ళో ఎనిమిది అంతస్తుల బిల్డింగ్‌లేదు కదండీ!

భర్త: అలా అయితే నాలుగు అంతస్తుల మేడలు వున్నాయి కదా! వాటిపై నుంచి రెండుసార్లు దూకి చస్తాను, సరేనా?

అయిదు దశాబ్దాల డాక్టర్ చక్రవర్తి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారి నంది అవార్డును అందుకున్న తొలి చిత్రం, తొలి తెలుగు నవలా చిత్రం 'డాక్టర్ చక్రవర్తి'. కోడూరి కౌసల్యాదేవి రచించిన 'చక్ర భ్రమణం' నవలకు ఇది వెండితెర రూపం. ఈ సినిమాలో జగ్గయ్య, అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి నటించారు. 1964లో నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నంది అవార్డును ఏర్పాటు చేసింది. తొలి అవార్డు డాక్టర్ చక్రవర్తి చిత్రానికి లభించింది. అదే ఏడాది ఉత్తమ ప్రాంతీయ చలన చిత్రంగా జాతీయ పురస్కారం కూడా ఈ చిత్రానికి దక్కింది. 'మనసున మనసై తోడకరుండిన అదే చాలును" అనే శ్రీశ్రీ గీతం ఈ చిత్రంలో వుంది. డాక్టర్ చక్రవర్తి చిత్రం విడుదలయి అయిదు దశాబ్దాలు దాటింది. ఒక తరం ప్రేక్షకుల్ని బాగా ఆకట్టుకున్న సినిమా ఇది. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో అద్భుతంగా రూపొందిన చిత్రమిది.

■ స్మరణ

ప్రజారచయిత ఆళ్వారు స్వామి

ప్రత్యేక సంస్కృతికి, చరిత్రకు ప్రతీకగా, ఒక ప్రబలమైన శక్తిగా ఎదిగితే ఏమౌతాడు? అచ్చంగా అతడు ఆళ్వారు స్వామియే అవుతాడు. మనిషి మనిషిగా పూచి, పరిమళించి, మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిస్తే తప్పక అతడు వట్టికోట అవుతాడు. సాహిత్య సంపదను తన భూజాల మీద మోసుకొని పోయి, పల్లె పల్లెనా చేరవేస్తూ, వ్యక్తి–వ్యక్తికీ పంచిపెడుతూ వచ్చిన అరుదైన సాహితీ మూర్తి అతడు. కథకుడు, నవలాకారుడు, ఉద్యమ శీలి అతడు. ఒక నిబద్ధత గల కార్యకర్త, యువకులలో యువకుడు, మేధావులల్లో మేధావి,



కమ్యూనిస్టుల మధ్య కమ్యూనిస్టు– నాయకుల నడుమ నాయకుడు కాని నాయకుడు, ఒక స్వాప్నికుడు, ఏకంగా ఒక స్పార్టకస్ వారసుడు, గోర్కి సృజనాత్మకతలో తడిసి తరించిన వోక ఆనంద వర్తనుడు, పేదల పాలిటి అవ్యాజ ప్రేమికుడు, అపారమైన పావురం గల గొప్ప స్నేహితుడౌతాడు. నూటికి నూరు పాళ్ళు మహోన్నతమైన ఒక మట్టి మనిషే అతడు. అవును, అచ్చంగా–నిస్సందేహంగా–భవిష్యత్ "ప్రజల మనిషి" అతడు.

1915 నవంబర్ 1న ఆళ్వారు స్వామి జననం

జన్మించింది లగాయతు వట్టికోట– దురహంకార పాలనపైన, దుష్ట పాలకుల దౌష్ట్యం పైన పోరాడుతూనే వచ్చాడు. తిరుగబాటు చేస్తూనే వచ్చాడు. ఎదిగే కొద్దీ, జైళ్ళ ఇనుపకోరల చిక్కి, బందీ అయినా, యుద్ధంలో శత్రువును నిలువరించిన శాంతి యోద్ధగానే కదులుతూ, చైతన్యంతో మెదులుతూ వచ్చాడు వట్టికోట.

పాఠశాల చదువు అంతగా వంటబట్టక పోయినా, అన్యాయం–అక్రమం–మోసం–వివక్ష–హెచ్చుతగ్గులు–ఆధిపత్యం వంటి అనేకాంశాలను, అనేకుల కన్న మిన్నగా అధ్యయనం చేస్తూవచ్చాడు ఆళ్వారు స్వామి. అధ్యయనానికి పరిమితం కాకుండా, వ్రాస్తూ వచ్చాడు. కాలం మీద తనదైన ఒక ప్రత్యేక సంతకం చేస్తూ వచ్చాడు.

ఇక సృజన కాలమంతా అతనిదే అయ్యిందన్నతంగా కదలుతూ వచ్చాడు వట్టికోట. కథలు, గల్పికలు, నవలలు వెలువడినై. "దేశోద్ధారక గ్రంథమాల" వంటి అపూర్వ సంస్థలు చోటు చేసుకున్నాయి. నిజాం నిరంకుశ పాలనలో ఇటువంటి సాహసికులు బతికిబట్టకట్టడమే అమూల్యమైన చారిత్రాకాంశం. ఆళ్వారు స్వామి దృఢ సంకల్పం, అకుంఠిత దీక్ష, చెక్కుచెదరని నిరతి వల్లనే ఇవన్ని సాధ్యమైనాయి.

పేదగ్రామీణ జీవితం నుంచి ఎదిగివచ్చి, ఒక అధ్యాపకునికి వండి పెడుతూ, బతుకుబండిని నెట్టుకుంటూ వచ్చిన వట్టికోటను, అతని సామాజికతత్వం–నిరంతర అధ్యయనమే అతని లేమిని, అన్ని విపత్తులనూ అలవోకగా గెలిచే శక్తి సామర్థ్యాలను అతనికి ప్రసాదించాయి. ఆ తరువాత, 1933 దాకా, కందిబండ గ్రామానికి చెందిన నారపరాజు సోదరులకు పనిచేసి పెడుతూ "అణా గ్రంథమాల" పుస్తకాలను అమ్మిపెట్టే ఒక ఉద్యమాన్ని కొనసాగించాడు. తెలంగాణ పల్లె పల్లెనూ చైతన్య పరుస్తూవచ్చాడు.

కోదాటి నారాయణరావు గారి సహకారంతో ఆనాటి 'గోలకొండ' పత్రికలో ప్రూఫురీడర్‌గా చేరి కొంతకాలం గడిపాడు ఆళ్వారు స్వామి. ఈ ఉద్యోగం పెద్దగా ఆర్థిక స్థోమతను సమకూర్చక పోయినా, బోలెడంత లోకజ్ఞానాన్ని, సాహిత్య పిపాసనూ పంచి ఇచ్చింది. నిరంతర అధ్యయనం వల్ల అనేకానేకంగా మేధావులు, ఉద్యమకారులు, సృజనశీలురతో గొప్ప పరిచయం కలిగింది, విప్లవోద్యమాల స్ఫూర్తిరగిలింది. ప్రపంచమే తన కళ్ళెదుట నిలిచినట్లయింది. పీడిత–తాడిత జనానికి, దిక్కుమొక్కు లేక అణగారిన వారికి తాను చాలా దగ్గరై పోయిన సోయి కలిగి, జ్ఞాన విస్తరణ కొక పెద్ద ఆదెరువయ్యింది.

1933లో వట్టికోట– సికింద్రాబాదుకు మకాం మార్చడమన్నది తెలంగాణ సాహిత్యోద్యమానికి పెద్ద మలుపుగా పరిణమించింది. యశోదమ్మతో వివాహం, సికింద్రాబాదుతో సంబంధాలు, అక్కడి వర్తక సంఘాలతో పరిచయాలు, యువకుల మధ్య పెనవేసుకు పోయిన స్నేహ సంబంధాలు, యువకుల మధ్య విరగబూసిన చైతన్య పరిమళాలు ఆళ్వారు స్వామి భావజాలాన్ని మరింత ప్రోదిచేసినవి తొలి తెలంగాణ నవలాకారుడుగానూ నిజాం రాష్ట్రంలో పౌరహక్కుల కోసం పోరాడిన ప్రథమ పౌరుడిగానూ ఎదిగే అవకాశాల్ని కలిగించినవి. దొడ్డి కొమురయ్య హత్యపై నిజ నిర్ధారణకు వెళ్ళిన తొలి కార్యకర్తగా ఉద్యమ కారులపట్ల తన కర్తవ్యాన్ని పాలించాడు వట్టికోట.

1942లో క్విట్ ఇండియా ఉద్యమం మొదలుకొని, నాలుగు సంవత్సరాలకు పైగా జైలు జీవితాన్ని అనుభవించిన వట్టికోట, చివరి వరకూ గట్టి పిండంగా మొక్కవోని సాహసికుడుగా నిలబడ్డాడు. ఏనాడూ కనీసపు సుఖాలనైనా చవి చూడని వట్టికోట–తన కొరకు ఏమీ మిగుల్చుకోని నిస్వార్థ జీవిగానే కడవరకూ కొనసాగినాడు. అరకొర బతుకు బతుకుతూనే అతడాసాంతం సాహిత్య సేనానిగా, సమతాధ్యేయ కార్యకర్తగా నిలబడ్డాడు గానీ కించిత్తు తడబడటంగాని, వెనుకడుగు వేయటంగానీ చేయలేదు. సభలను రంజింప జేసే ఉత్తమ ఉపన్యాసకుడుగా ఎదిగాడు. సాహిత్య సంస్థలను పెంచి పోషించిన సాహసికుడైనాడు.

ఉద్యమ నేపథ్యం, సాహిత్య సృజన అనేవి ఒక వంతైతే, "తెలంగాణా" సంపుటాలను వెలువరించటమన్నది ఆళ్వారు స్వామి దొక గొప్ప సేవ అవుతుంది. అన్ని రంగాలకు చెందిన తెలంగాణ వివరాలను, అందులో పొందుపరిచాడాయన. ఇప్పటికీ ఈ సంపుటాలు సమగ్రమైనవిగా నిలుస్తున్నాయంటేనే మనం అతని అసమాన ప్రతిభను, అనితర సాధ్యమైన శ్రద్ధను గురించి అంచనా వేయవచ్చును.

1952లో వెలువడిన **"ప్రజల మనిషి"** నవలలో వట్టికోట ఆనాటి గంథ్రాలయోద్యమం, రాజకీయ - ప్రజా ఉద్యమాలు, తన కాలంనాటి స్వానుభవాలకు చిత్రీకరణ అద్భుతంగా చోటు కల్పించాడు. తెలంగాణ ఉద్యమ జీవితాలకదొక అరుదైన దర్పణంగా నిలిచి, అంతకంతకూ భాసిస్తుంది. ఈ నవలకు కొన సాగింపుగా **"గంగు"** వచ్చింది. జైలు జీవితాన్ని వివరించే గ్రంథం–జైలు లోపలే రూపుకట్టింది. ఇవిగాక, వారి మరొక అసాధారణ కృషి ఫలితం–**"గ్రంథాలయ సూచి"** అవుతుంది. ఈ విధంగా నిరంతరం అటు ఉద్యమ జీవితానికి, ఇటు సాహిత్య సృజనకు నడుమ ఒక పంతుల–సమన్వయాన్ని సాధిస్తూ, నిజాం క్రూర ప్రభుత్వం మీద నిప్పులు చెరుగుతూ వచ్చి, తెలంగాణ అంతటా ఉద్యమమై విస్తరించిన ఆళ్వారు స్వామి తన 47వ యేటనే, అనగా 1961 ఫిబ్రవరి 5న హఠత్మారణం చెందటంతో ఒక గొప్ప అధ్యాయం ముగిసినట్టైంది.

ఆళ్వారు స్వామి మరణానంతరం కోదాటి వారు–"గ్రంథాలయ సూచి"ని నగర కేంద్ర గ్రంథాలయానికి ఇప్పించారు. తెలుగు సాహిత్యంలో అతడొక అరుదైన రచయితగా, తెలంగాణ వైతాళికులలో తలమానికంగా నిలుస్తాడు. అటువంటి అతని పేరిట గ్రంథాలయంలో ఒక విగ్రహం నెలకొల్పటం మాట అటుంచి, నగరకేంద్ర గ్రంథాలయానికి అతని పేరైనా పెట్టక పోవడం శోచనీయం.

మహోన్నత సాహిత్య శీలి, ఆలు పెరుగని ఉద్యమ కారుడు గనుకనే, మహాకవి దాశరథిగారు తమ "అగ్నిధార"ను ఆళ్వారు స్వామికి అంకితమిచ్చారు. "దేవునిపై భక్తి లేకున్న జీవులపై భక్తి గల వాడని, అతని జీవన ధర్మాన్ని, తాత్వికతను ప్రశంసించారు. అంతే కాదు, 'మంచికి పర్యాయపదం ఆళ్వారు, అతనిదే సార్థకమైన జీవితం' అంటూ కొనియాడారు.

– వేణు సంకోజు, 9948419881

అణాగ్రంథమాల పాత్ర అపూర్వం

ఉద్యమకారుడు, రచయిత, ప్రచురణకర్త ఆయన ఆళ్వారు స్వామి తెలంగాణా సామాజిక చైతన్యోద్యమంలో క్రియాశీలక పాత్ర వహించాడు. ఒకటి నవంబర్, 1915న నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెర్వు మాదారం (మాధవరం)లో నిరుపేద కుటుంబంలో జన్మించాడు. నకిరేకల్‌లో ఉపాధ్యాయుడు కంచినేపల్లి సీతారామారావు వద్ద, కందిబండలో నారపరాజు రాఘవ రావు వద్ద వంటపని మొదలైనవి చేసి వాళ్లాసగిన స్ఫూర్తితో గ్రంథాలయోద్యమంలో పాల్గొన్నాడు. బెజవాడలో హోటల్ సర్వర్‌గా పనిచేసి, 1933లో హైదరాబాదు గోలకొండ పత్రికలో ప్రూఫురీడర్‌గా చేరాక ఆయనలో సాహిత్య పరిచయం విస్తృతమైంది.

1938లో స్టేట్ కాంగ్రెస్ సభ్యునిగా చేరి క్విట్ ఇండియా ఉద్యమంలో 1942లో జైలు శిక్ష అనుభవించాడు. తర్వాత కూడా ప్రజా ఉద్యమ పోరాటంలో పాల్గొని కారాగార వాసం చేశాడు. నిజామాబాద్ జైల్లో దాశరథి మున్నగు సమరయోధులతో పరిచయం కలిగి ఆయన పద్యాలు జైలు గోడలపై బొగ్గుతో రాసేవాడు. తమ స్నేహబంధానికి గుర్తుగా దాశరథి తన 'అగ్నిధార' కావ్యాన్ని (1949) వట్టికోటకు అంకితం చేశాడు.

దేశోద్ధారక గ్రంథమాల :

ప్రసిద్ధ పత్రికా సంపాదకులు, గ్రంథ ప్రకాశకులు ఆయిన కాశీనాథుని నాగేశ్వరరావు పేరిట 1938లో దేశోద్ధారక గ్రంథమాలను నెలకొల్పిన ఆళ్వారు స్వామి తెలంగాణా రచయితల ఆమూల్య గ్రంథాలను ప్రకటించి సాహిత్య చైతన్య వ్యాప్తికి నిర్విరామ కృషి సల్పాడు. నిజాం ప్రభుత్వంపై వ్యతిరేక పోరాటం వల్ల జైలు జీవితం గడపటం వల్ల 1941–49 మధ్య అవాంతరం కలిగినప్పటికీ 1950 నుంచి 1961లో తుదిశ్వాస వదిలే వరకూ ఎందరో రచయితల గ్రంథాలు ముద్రించి వెలుగులోని తెచ్చాడు. ఏ ఊరు వెళ్లినా వ్రాత ప్రతులను సేకరించి వెంటనే వాటి ప్రచురణకు పూనుకొనేవాడు. 1938–41 మధ్య 12 గ్రంథాలు, 1953–61 మధ్య 21 గ్రంథాలు మొత్తం ముప్పయి మూడు (కథలు, కవితలు, నాటికలు, వ్యాపాలు, నవలలు మున్నగు వివిధ ప్రక్రియలు) దేశోద్ధారక గ్రంథమాలలో ప్రకటితమైనాయి.

సురవరం 'హైందవ వీరులు' (1938) మొదలుకొని 'కాళోజీ నా గొడవ' (1953), దాశరథి 'పునర్నవం' (1956), 'పరిసరాలు' కథా సంపుటులు రెండు (1956) 'తెలంగాణ' వ్యాస సంపుటులు రెండు (1956), 'జీవనరంగం, నాటక సంకలనాలు రెండు (1954) నేదునూరి గంగాధరం జానపద గేయాలు ' సెలయేరు' (1955) మొదలైనవి వీనిలో పేర్కొనదగినవి. ఇంకా ఆదిరాజు వీరభద్రరావు, వానమామలై వరదాచార్యులు, కె.ఎల్. నరసింహారావు, పొట్లపల్లి రామారావు, హీరాలాల్ మోరియా మున్నగు వారి రచనలు కూడా గ్రంథమాల ద్వారా ప్రచురితమైనాయి. 31వ ప్రచురణ 'ప్రభాస' (ఉపన్యాస సంపుటి–1958) చివర రాబోయే ప్రచురణలుగా 25 గ్రంథాలను పేర్కొనటం జరిగింది.

వట్టికోట స్వీయ రచనలైన ప్రజల మనిషి, జైలులోపల దేశోద్ధారక గ్రంథమాల ప్రచురణలే. 'ప్రజల మనిషి' 1947కు పూర్వం తెలంగాణా రాజకీయ వాతావరణం, గ్రామీణ వ్యవస్థను చిత్రించిన నవలగా ప్రసిద్ధి పొందింది. 'జైలులోపల' (1953) జైలులోని స్వీయానుభవాలతో కూడిన కథల సంపుటి. మరొక రచనయైన 'రామప్ప రభస' (వ్యంగ్య రచనల సంపుటి) ఆయన మరణానంతరం 1984లో వెలుగులోకి వచ్చింది. గ్రంథమాలనే కాకుండా గుమాస్తాలు, రిక్షా కార్మికుల సంఘాలు కూడా నెలకొల్పి వారి పక్షాన ఉద్యమం సల్పుతూ సాహిత్య–సామాజిక రంగాల సేవలో 'గట్టికోట'గా నిలచిన వట్టికోట 46 సంవత్సరాల పిన్న వయసులో 1961 ఫిబ్రవరి 6న తనువు చాలించటం దురదృష్టకరం. ఆయన 'ప్రజల మనిషి' ద్వారా ప్రజా రచయితగా పేరొందారు.

– ఆచార్య ఎస్సీ రామారావు, 9848012053



నెమలీక



చిట్టి చీమ

అనగనగా ఒక దట్టమైన అడవి. ఆ అడవి మధ్యలో పెద్ద వాగు ఉంది. అది వర్షాకాలంలో పెద్ద వాగుగా, ఎండాకాలంలో పిల్లకాలువగా కనిపిస్తుంది. అందులో చిరుతలు, సింహాలు, ఏనుగులు, జింకలు, ఎలుకలు, కోతులు.... ఇలా ఎన్నో జంతువులు ఉన్నాయి. ఆ అడవికి రాజు గజేంద్రుడనే ఏనుగు. అడవి లోపల ఒక చీమల రాజ్యం ఉంది. దానికి తీపయ్య అనే రాజు అధిపతిగా ఉండేవాడు. తీపయ్యకు తన రాజ్యంలోని అందరూ సంతోషంగా ఉండాలని కోరుకునేవాడు. అందుకు తగ్గట్టు ఎంతో కృషి చేసేవాడు కూడా. చీమలు ఆహారం కోసం వెళ్లినప్పుడు ఏదైనా ప్రమాదం వస్తుందేమోనని ఎన్నో జాగ్రత్తలు చెప్పేవాడు. ఆ రాజ్యంలోని చీమలు ఏ చీకూ చింతా లేకుండా సంతోషంగా జీవించసాగాయి.



తీపయ్యకు ఒక కొడుకు ఉన్నాడు. వాడి పేరు పంచదార. తీపయ్యకు కొడుకంటే అమితమైన ప్రేమ. అయితే తండ్రి మంచితనం కొడుక్కు ఏ మాత్రమూ రాలేదు. చదువు సంధ్యలు లేకుండా స్నేహితులతో జులాయిగా తిరుగుతుండేవాడు. అహంకారం, పొగరు, మూర్ఖత్వం లాంటి అవలక్షణాలన్నీ పంచదారలో ఉన్నాయి. తనకు నచ్చిన పని చేయడానికి ఎవరు వద్దని చెప్పినా వినడు.

ఓ సారి వర్షాకాలంలో అడవిలోని వాగు పొంగి పొర్లింది. చీమలన్నీ బయటికి రాకుండా ఇళ్లలో ఉండిపోయాయి. అదే సమయంలో పంచదార అడవిలోకి షికారుకు వెళ్లాడు. తండ్రి వారిస్తున్నా వినలేదు. ఎంతో హుషారుగా అడవి అందాలన్నీ చూసుకుంటూ వెళ్తున్నాడు. అంతలో పెద్ద శబ్దం వినిపించింది. ఏమిటా అని చూస్తే ఎదురుగా ఏనుగుల మంద వస్తూ కనిపించింది. పంచదారకు వాటిని చూడగానే 'ఇంత చిన్న పొట్టకే ఆహారం వెతుక్కోలేక చస్తుంటే, ఇంత పెద్ద ఆకారాలతో ఎలా బతుకుతాయో ఈ ఏనుగులు! వీటిని చూసుంటే ఒక్క గుటకలో ఈ అడవిని మొత్తం మింగేసేలా ఉన్నాయి' అని నవ్వుకున్నాడు. మళ్లీ అంతలోనే 'ఏంటి ఈ ఏనుగుల గొప్పదనం?' అని పొగరుగా వాటి కెదురుగా వెళ్లి నిల్చున్నాడు.

ఏనుగులు వాటిని చూడకుండా వెళు న్నాయి.

పంచదారకు కోపమొచ్చి 'ఈ అడవిలోని చీమల రాజ్యానికి కాబోయే రాజుని. నన్నే గుర్తించవా ఈ ఏనుగులు?' అనుకుని పక్కనే ఉన్న పెద్ద పుల్ల తీసుకుని ఏనుగు కాల్లో గుచ్చాడు. ఏనుగు కాలికి ఏదో తలిగినట్లనిపించి చక్కిలిగిలి అయింది. కింద ఏముందా అని చూస్తే ఓ ఎండుటాకుమీద ఉన్న చీమని చూసి నవ్వింది.

'నన్ను చూసి నవ్వుతావా? నేను చీమల రాజ్యానికి కాబోయే రాజుని! నాతో యుద్ధం చేసి గెలువు చూద్దాం' అంది పంచదార.

ఏనుగు ఒక్క నవ్వు నవ్వి తన తొండంతో గాలి ఊదింది. అంతే పంచదార ఎగిరి పక్కనే ఉన్న వాగులో పడింది. ఎలాగో ఒక ఆకును పట్టుకుని చెరువు ఒడ్డుకు చేరి ఇంటి దారి పట్టింది పంచదార. ఇంటికి వెళ్లగానే తండ్రికి తీపయ్యకి చెప్తే, ఆయన బాగా కొడుక్కే చీవాలు వేసి బుద్ధి చెప్పాడు. అప్పుడు గానీ పంచదారకు తన తెలివి తక్కువతనం తెలిసిరాలేదు. ఇక అప్పట్నుండి తండ్రి చెప్పినట్లు నడుచుకుని మంచి బాటలో నడిచాడు. ఆ చీమల రాజ్యానికి రాజయ్యాడు.

చుక్కలు కలుపుదాం

ఈ చీమలు మోస్తున్న ప్రాణి ఏదో తెలియాలంటే వరుస సంఖ్యలో చుక్కలు కలపాల్సిందే.

ఆ పదం ఏంటో తెలుసా?



బొమ్మలు, వాటి దగ్గరున్న అంకెలను బట్టి ఇక్కడున్న గళ్లలో వాటిని ఇంగ్లీషులో ఏమంటారో రాయండి. నలుపు గళ్లలోని అక్షరాలను కిందున్న గళ్లలో రాయండి.

జవాబు : sale

అతికించండి



ఈ బొమ్మలో నలుపు రంగులో కనిపిస్తున్న భాగాల ప్రదేశంలో పక్కనున్న తెలుపు రంగు ముక్కలను అతికించండి.

జవాబు : 1–ఔ, 2–ఊ, 3–ఎ, 4–ఇ, 5–ఐ,

రంగులు వేద్దాం



చూసి గీద్దాం



దేని దారి ఏది?



నాలుగు రకాల వస్తువులు, వాటికి దారాలు కట్టి ఉన్నాయి. ఏ దారం ఏ వస్తువుదో కనుక్కోండి.

జవాబు : 4-b, 3-d, 2-c, 1-a

పట్టుకోండి

ఈ బొమ్మలో పక్కన కనిపిస్తున్న వస్తువులు దాగున్నాయి. వాటిని వెతికి పట్టుకోండి

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

ఫ్రెంచి విప్లవ కాలంలో (1789–1799) పద్దెనిమిదేళ్ల లూయీ ఫిలిప్, అప్పటి రాజుగార్ని గద్దె దించటానికి ప్రయత్నించాడు. ఆ తర్వాత, ఇంగ్లండు, అమెరికాలో ప్రయాణించటం వల్ల ఆధునిక, అభ్యుదయ రాజకీయ అభిప్రాయాలను కొంత వంట పట్టించుకున్నాడు. ఇప్పుడు, తన పాలన పట్ల ఎంత వ్యతిరేకత పెల్లుబికినా, తన వ్యాపారానికి అడ్డు తగలనంత వరకూ పరవాలేదనుకున్నాడు. పదవీచ్యుతుడైన తన తండ్రి నుంచి నేర్చుకున్న పాఠం ఒక్కటే. నిరసనకారుల పట్ల, ప్రతిపక్షం పట్ల కొంత పట్టూవిడుపూ వుండాలి. ఇలా ఉండటం తన వ్యాపార ప్రయోజనాలకు కూడా అవసరం. వాణిజ్యం బాగుంటేనే కదా! ప్రభుత్వ ఖజానాలోకి పన్నులు వచ్చి చేరతాయి. ఈ నిర్ణయాల ఫలితంగా, పారిస్ తళుకు బెళుకులతో జిగేల్మంది. 250 గజాల షాంటిలీ లేస్, ఇండియన్ కాశ్మీర్ (గుడ్డ)తో తయారు చేసిన గౌను 10,000 ఫ్రాంకులకు అమ్ముడుపోయింది. అది ఒక కూలీనాలీ చేసుకునే కుటుంబానికి ఏడాది ఆదాయం. అయితే, ఇంత విలాస జీవితం ఉన్న పారిస్‌లో రాడికల్ వామపక్ష ప్రవక్తలు తిష్టవేశారు (వీళ్ల వెంట వున్న మహిళలు పైన చెప్పిన ఖరీదైన డ్రెస్సుల్లాంటివి ధరించినప్పటికీ) ఆనాటి 'యూరోపియన్ నాగరికతకు కేంద్రం పారిస్' అన్నాడు ఎంగెల్స్.

ఇలాంటి పారిస్ సంరంభంలోకి ప్రవేశించారు మార్క్స్ దంపతులు. ఇక్కడి స్వేచ్ఛా వాతావరణం కోసమే వచ్చారు వాళ్లు. ఏదైనా రాసుకోవచ్చు, ప్రచురించవచ్చు. ఏ ఆంక్షలూ లేవు. నిజానికి ఇక్కడి స్వేచ్ఛ, వాళ్లు ఊహించిన దానికన్నా చాలా ఎక్కువ. ప్రష్యాలో అదొక ఊహ. ఒక భావన మాత్రమే. ఇక్కడ అది ఒక అనుభవం. ఇక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలరు. నిలదీయగలరు. లిబరలిజం, సోషలిజం, కమ్యూనిజం, నేషనలిజం గురించిన చర్చలు బాహాటంగా జరుగుతున్నాయి. కార్ల్, జెన్నీలు స్వదేశం కదిలి రావటం ఇదే తొలిసారి. అయినా, పారిస్ వాళ్లకు నచ్చింది. తమ కార్యక్షేత్రం ఇదే అనుకున్నారు.

పారిస్ జీవితంలో నాటక రంగం ఒక ప్రధాన భాగం. జెన్నీకి హాస్య, వ్యంగ్య నాటక ప్రదర్శనలంటే ఇష్టం. ఇక్కడి సంపన్నుల జీవిత సరళి ఆమెను ఆశ్చర్యం కలిగించింది. వాళ్లకు ప్రేమ వ్యవహారాలు తప్ప మరేమీ పట్టవు. ఇళ్లలో పనిమనుషులు వాళ్లకు అన్ని రకాల సేవలూ చేస్తుంటారు. కానీ ఈ సేవకులే వాళ్ల శత్రువులు. పేదలకు ధనికులంటే అసహ్యం, ద్వేషం. అవకాశం వచ్చినప్పుడు మొదట తిరగబడేది వాళ్లే.

తన తొలి యవ్వనమంతా ట్రీయర్‌లో కార్ల్ నిరీక్షణలో గడిపిన జెన్నీకి ఇప్పుడు తన కలల లోకం కళ్ల ముందు కనిపించింది. పత్రిక వల్ల మార్క్స్ ఆదాయం పెరుగుతుంది. సుఖంగా బతకొచ్చు. తను రాయదలచుకున్న పుస్తకాల గురించి చెప్పాడు కార్ల్. తను అవన్నీ కాపీ చేసి పెడుతుంది. త్వరలో తల్లి కాబోతున్నది. ఇక్కడ విప్లవ భావాలు కూడా అందంగానే కనిపిస్తున్నాయి. ఇన్నాళ్లూ రైన్‌లాండ్‌లో గడిపిన జెన్నీకి పారిస్ జీవితం మత్తెక్కించింది.

వీళ్లు రావటానికి ముందే రూగ్, భార్యా పిల్లలతో, సరిపడా ఆహార నిల్వలతో అక్కడికి చేరుకున్నాడు. పెళ్లి వల్ల అతడికి డబ్బు కలిసొచ్చింది. కానీ మహా జాగ్రత్తపరుడు. తాము, మరో కవి జార్జ్ హెర్వేగ్, ఆయన భార్యతో కలిసి సమిష్టి జీవితం గడిపితే పొదుపుగా బతకవచ్చునని కార్ల్ దంపతులకు సూచించాడు రూగ్. ముగ్గురు పురుషులూ పత్రికలో పనిచేసేవాళ్లే. వాళ్లు వుంటున్న చోటుకి ఎదురుగానే పత్రికాఫీసు. ఆడవాళ్లు కలిసి మెలిసి ఇంటి పనులు చేసుకోవచ్చు. మొదట ఈ ప్రతిపాదన మార్క్స్ దంపతులకు నచ్చి ఉంటుంది. తోటి జర్మన్లతో కలిసి సరదాగా గడపొచ్చు. కానీ ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. అనేక సంవత్సరాల తర్వాత, హెర్వేగ్ కుమారుడు నెమరేసుకున్నట్టుగా, 'సాదాసీదాగా వుండే రూగ్ భార్య, బాగా చదువుకున్న మేధావి అయిన జెన్నీతో కలిసి వుండటం అసాధ్యం' కేవలం రెండు వారాలు మాత్రమే ఈ 'సమిష్టి సంసారం' కొనసాగింది. అవకాశం దొరికిన వెంటనే, మార్క్స్ దంపతులు మరో విశాలమైన ఇంటికి మారారు.

పారిస్‌లోని రాడికల్, ప్రజాస్వామిక బృందాలతో సన్నిహితంగా మెలిగారు మార్క్స్ దంపతులు. మొదటిసారి తమను తాము మిస్టర్ అండ్ మిసెస్ మార్క్స్‌గా పరిచయం చేసుకున్నారు. పారిస్‌లోని అందగత్తెల మధ్య కూడా తన అందంతో మేధో చతురతతో అందర్నీ ఆకర్షించింది జెన్నీ. మార్క్స్‌కు జెన్నీని చూస్తే గర్వంగా ఉంటుంది. తొలి రోజుల నుండీ, ఆమెను తనతో సరిసమానమైన వ్యక్తిగానే పరిగణించాడు. చర్చలలో మార్క్స్ ఎవర్నైనా చీల్చి చెండాడతాడు. ఎదుటి వ్యక్తి వాదాన్ని తన తార్కిక ప్రావీణ్యంతో నిర్వీర్యం చేస్తాడు. అలాంటివాడు కూడా, జెన్నీ అభిప్రాయాలకు ఎంతో విలువ ఇచ్చాడు. తన జీవితంలో, అంతగా గౌరవించిన మరొక వ్యక్తి ఎంగెల్స్ మాత్రమే. చర్చలలో ఉగ్ర నరసింహుడిగా ఉండే మార్క్స్‌ను శాంతింపజేయగల శక్తి జెన్నీకి మాత్రమే ఉంది.

ఇతర సమయాలలో చాలా సరదాగా ఉంటాడు మార్క్స్. పని ఒత్తిడితో చికాకు పెరిగినప్పుడు మాత్రం ఆయన మూడ్ మారిపోతుంది. అప్పుడు, రాత్రుళ్లు నిద్రపోడు. తరచూ జబ్బు పడతాడు. వాదోపవాదాలలో జగమొండి. తనతో విభేదించిన వాళ్లంటే అసహనం. బాన్, బెర్లిన్, కొలోన్‌లలో తాగుతూ కూర్చున్నప్పుడు, పొట్లాటలు తన్నుకునే దాకా పోలేదుగాని గట్టిగా అరచుకోవటం మామూలే. ఆయనది మర్యాదల్ని పట్టించుకోని స్వభావం. పరాయీకరణ గురించి అంతగా రాసిన మనిషి ఎవరితోనూ కలవటానికి పెద్దగా ఇష్టపడడు. తన ప్రవర్తనతో, అసహనంతో అనేకసార్లు, తన దగ్గరి వ్యక్తుల్ని కూడా దూరం చేసుకున్నాడు. చర్చలు, వాదోపవాదాలతో కొత్త జవసత్వాలు వచ్చి ఉండవచ్చుగాని, ఆయనకు ఏకాంతంలో, పుస్తకాల సాంగత్యంలో గడపటమే ఇష్టం. ('పుస్తకాలు నా బానిసలు' అనేవాడు.) స్వభావరీత్యా మార్క్స్ అంతర్ముఖుడు. అయినా తన ఆత్మవిశ్వాసంతో, నాయకత్వ లక్షణాలతో ఎందర్నో ఆకర్షించాడు. రష్యన్ ఉదారవాది పావెల్ అన్నెకోవ్, మార్క్స్‌ను 'ప్రజాస్వామిక

ఇతర సమయాలలో చాలా సరదాగా ఉంటాడు మార్క్స్. పని ఒత్తిడితో చికాకు పెరిగినప్పుడు మాత్రం ఆయన మూడ్ మారిపోతుంది. అప్పుడు, రాత్రుళ్లు నిద్రపోడు. తరచూ జబ్బు పడతాడు. వాదోపవాదాలలో జగమొండి. తనతో విభేదించిన వాళ్లంటే అసహనం.

నియంత' అన్నాడు.

అయితే, జెన్నీ ఇందుకు పూర్తిగా భిన్నం. సొసైటీ జీవితం గురించి ఆమెకు బాగా తెలుసు. అందరిలో కలివిడిగా ఉంటుంది. ఆమె భర్తను చూసి భయపడేవాళ్లు కూడా ఆమెతో చనువు తీసుకొని మాట్లాడగలరు. ఆమె పక్కన ఉన్నప్పుడు మాత్రమే మార్క్స్ కాస్త 'రిలాక్స్‌డ్'గా కనిపించేవాడు. ఈ 'అడవి మనిషి'ని తాత్కాలికంగానైనా దారికి తీసుకురాగల ట్రెయినర్ జెన్నీ.

పారిస్ చేరేనాటికి, జెన్నీకి ఇరవై తొమ్మిది. మార్క్స్‌కు ఇరవై అయిదు. కొలోన్ రోజుల నుండీ, రచయితగా, జర్మన్ కాందిశీకులలో ఆయనకు మంచి గుర్తింపే ఉన్నది. కాని, అక్కడ ఇతర జర్మన్ ప్రముఖులతో పోల్చితే, ఆయన కీర్తి తక్కువే. కవి హెర్వెగ్‌కు అంతకన్నా ఎక్కువ పేరుంది. ఆయన పుస్తకం, రాజకీయ కారణాల వల్ల నిషేధానికి గురైన తర్వాత, రాజుగారు ఫ్రీడ్రిక్ విల్హెల్మ్ – ళ్ళీం ఆయన్ను పిలిచి ప్రష్యా సాంస్కృతిక పునరుజ్జీవనంలో తన పాత్ర పోషించమని కోరాడు. కానీ హెర్వెగ్ తన ప్రజాస్వామ్య వాదిననీ, రాజు గారికి సేవ చేయలేననీ బహిరంగ ప్రకటన చేశాడు. ఆ తర్వాత, కవిగార్ని ప్రష్యా నుండి బహిష్కరించారు. అలా, అనేక దేశాలు తిరిగి, పారిస్ చేరుకున్నాడు హెర్వెగ్. ఊహించినట్టుగానే బహిష్కరణ తర్వాత ఆయన కీర్తి పెరిగింది. ఒక బెర్లిన్ సిల్క్ వ్యాపారి కూతుర్ని పెళ్లి చేసుకున్నాడు. (పెళ్లిలో మిఖాయిల్ బకూనిక్ 'బెస్ట్‌మాన్'గా వ్యవహరించాడు!) ఇక నవ జర్మనీ గళం తనే అనుకున్నాడు.

మార్క్స్ లాగ, హెర్వెగ్ కూడా రూగ్ పత్రికకు రాయటానికి ఒప్పందం కుదుర్చుకున్నాడు. 1840 నాటికి ధనికులు, కళాకారులను పోషించటం మానేశారు. గతంలో వాళ్ల చిత్రాలకూ, కవిత్వానికీ డబ్బులిచ్చేవారు. ఇప్పుడు 'పోషకాలు' లేక అందరూ రోడ్డున పడ్డారు. మార్క్స్ వీళ్లను 'మేధో కార్మికులు' అన్నాడు. పొట్ట చేత పట్టుకున్న కళాకారులు, సహజంగానే రాజకీయాల వైపు మొగ్గు చూపారు. ఒక రచయిత తమ రచనలన్నీ రాజకీయ అస్త్రాలే అన్నాడు. ఆనాటి కవులను గురించే కాబోలు 'వీళ్లదో వింత జాతి. మనుషులకు అన్వయించే మంచి చెడులతో వీళ్లను బేరీజు వెయ్యలేం' అన్నాడు మార్క్స్.

హెర్వెగ్‌తో మార్క్స్ కలిసి వున్న కాలంలోనే ఒక జర్మన్ డాక్టర్, ఆయనకు హైన్రిష్ హైన్‌ను పరిచయం చేశాడు. కార్ల్ బాల్యం నుండీ హైన్, పారిస్‌లో కాందిశీకుడిగా బతుకుతున్నాడు. అతడు, ఆయనకు తల్లివైపు బంధువు. కార్ల్‌కన్నా ఇరవై ఏళ్లు పెద్ద. కార్ల్‌ది ఎవరితోనూ స్నేహం చేసే స్వభావం కానప్పటికీ ఇద్దరికీ మంచి దోస్తీ కుదిరింది. అయితే అప్పటికే, ఆయన ఆరోగ్యం పాడైంది. ఈ మృత్యువు ఎంతో దూరం లేదు. హైన్‌కు పరిచయస్తులలో గొప్ప 'అహంభావి'గా పేరుంది. అయినా త్వరలోనే మార్క్స్ దంపతుల ఇంట్లో ఒక సభ్యుడిగా మారిపోయాడు. వీళ్ల పరిచయం ఒకరకంగా ఇద్దరికీ లాభించింది. హైన్ రాజకీయాల అవసరం గుర్తించాడు. మార్క్స్ కళాత్మకంగా పరిణితి చెందాడు.

***

ఫ్రెంచి జర్మన్ భాషల్లో రూగ్ నవంబర్ 1843 నుండి ప్రారంభించదలచుకున్న మాస పత్రికకు ఆర్థిక సమస్యలు అడ్డు పడ్డాయి. రాసేవాళ్ల కొరత మరో కారణం. ఒక్క ఫ్రెంచి రచయితా రాయటానికి అంగీకరించలేదు. రాయటానికి అంగీకరించిన ఒకే ఒక జర్మనేతర రచయిత రష్యన్ బకూనిక్ (అప్పటికతడు పారిస్‌లోనే ఉన్నాడు). ఫ్రెంచి రచయితలను వెతికి తెచ్చేపని మార్క్స్‌కు అప్పజెప్పాడు రూగ్. (ఫ్రెంచి రచయిత్రులు 'జార్జి సాండ్, ఫ్లోరా ట్రిస్టాన్ లాంటి వాళ్లను 'బొట్టు పెట్టి మరీ పిలవాలా?' అని కూడా ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. మార్క్స్‌కు ఈ ఇద్దరూ బాగానే తెలుసు. అయితే, ఆయన వాళ్లను పత్రికకు రాయమని అడిగాడా అనేది సందేహమే. మొత్తం మీద ఏ ఫ్రెంచి రచయితా పత్రికలో కనిపించలేదు. జర్మన్లు, ఫ్రెంచి తాత్విక భావనలను స్వాగతించారు గాని, ఫ్రెంచి వాళ్లు జర్మన్‌ల అభిప్రాయాల పట్ల ఉత్సాహం చూపించలేదు. 1789లో (ఫ్రెంచి విప్లవకాలం) తాము ఎదుర్కొన్న సమస్యలనే ఇప్పుడు జర్మన్లు ఎదుర్కొంటున్నారన్నది ఫ్రెంచి వాళ్ల భావన.

ఈ సమస్యలతో రూగ్‌లో కోపం, విసుగు పెరిగాయి. పత్రిక ప్రచురణ 1844 ఫిబ్రవరి దాకా వాయిదా పడింది. చివరికి, మార్కెట్లోకి మార్క్స్ సంపాదకత్వంలో అదో పుస్తకంలాగ, హెర్వెగ్, హైన్‌ల కవితలతో వచ్చింది. ఇవిగాక, జర్మనీలోని పరిస్థితులను విమర్శిస్తూ, రూగ్, మార్క్స్, ఫాయర్‌బాక్, బకూనిక్ రాసుకున్న లేఖలు, మోజెస్‌హెస్, బకూనిక్‌ల వ్యాసాలు, మార్క్స్ వ్యాసాలు రెండు, మరొకటి ఇంగ్లండులో వున్న జర్మన్ రాసిన వ్యాసం. ఆ రచయిత పేరు ఎంగెల్స్ – పత్రికను వెయ్యి ప్రతులు ముద్రించారు.

రూగ్ కొంతవరకు ప్రజాస్వామ్యవాది అయినప్పటికీ, మార్క్స్ తన పత్రికను రాడికల్ వ్యాసాలతో నింపటాన్ని సహించలేకపోయాడు. ముఖ్యంగా సాహిత్య మర్యాదలను అతిక్రమిస్తున్నట్టున్న ఆ శైలి మీద కోపం వచ్చింది. (మార్క్స్ శైలిని విమర్శించిన వాళ్లలో రూగ్ మొదటివాడు మాత్రమే. పేజీలకొద్దీ సాగే పేరాగ్రాఫులు, ఎవరికీ తెలియని సాహిత్య విషయాల గురించిన ప్రస్తావనలు, ఓ పట్టాన అర్థంకాని వాదనలు, పాఠకుడు అర్థం చేసుకుంటాడా లేదా అన్న

పారిస్ చేరేనాటికి, జెన్నీకి ఇరవై తొమ్మిది. మార్క్స్‌కు ఇరవై అయిదు. కొలోన్ రోజుల నుండీ, రచయితగా, జర్మన్ కాందిశీకులలో ఆయనకు మంచి గుర్తింపే ఉన్నది. కాని, అక్కడ ఇతర జర్మన్ ప్రముఖులతో పోల్చితే, ఆయన కీర్తి తక్కువే. కవి హెర్వెగ్‌కు అంతకన్నా ఎక్కువ పేరుంది.

విషయమే గమనించేవాడు కాదు మార్క్స్). తమకు బంగారు భవిష్యత్తు ఇస్తుందనుకున్న పత్రిక 'మొదటి సంచికతోనే మూత పడింది' అని గుర్తు చేసుకుంది జెన్నీ.

పారిస్‌లో దానికి పాఠకులు లేరు. జర్మన్ సరిహద్దులో దాన్ని లోనికి రాకుండా అడ్డుకున్నారు. రూగ్, ఫ్రోబెక్ తమ పెట్టుబడులు ఆపేశారు. ఇక తాము వెనక్కు వెళ్లలేమోనన్న జెన్నీ భయాలు నిజమయ్యాయి. మార్క్స్, రూగ్, హైన్‌లు జర్మన్ గడ్డమీద కాలు మోపగానే అరెస్టు చెయ్యాలని ఆదేశించింది ప్రష్యన్ ప్రభుత్వం. వాళ్లమీద దేశ ద్రోహ నేరం మోపారు.

ప్రష్యన్లకు కోపం తెప్పించినవి అందులోని రెండు మార్క్స్ రచనలు. అవి ఆయన హనీమూన్‌లో ఉన్నప్పుడే ప్రారంభించాడు. అందులో ఒకటి హెగెల్ మీది విమర్శ. మరొకటి పేరు 'ఆన్ ది జువిష్ క్వొశ్చన్'. బెర్లిన్, కొలోన్‌లలో తను నేర్చుకున్న పాఠాలు ఆధారంగా అవి రాశాడు మార్క్స్. వాటిమీద ఫ్రెంచి తాత్విక భావాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. అంతేకాదు ప్రోలిటేరియట్ గురించిన చర్చ కూడా ఉంది. ప్రోలిటేరియస్ – లాటిన్ పదం. అందరికన్నా తక్కువ వర్గం లేదా ఆస్తి లేని వాళ్లు అని అర్థం. అయితే, మార్క్స్ దీన్ని 'సామాజిక మార్పు సృష్టించిన బాధితులు' అనే అర్థంలో వాడాడు. అంటే వీళ్లు మొదటి నుండీ పేదలు కాదు. పందొమ్మిదవ శతాబ్దిలో వచ్చిన పారిశ్రామిక విప్లవం ఫలితంగా – మనుషులు చెయ్యాల్సిన పనులు యంత్రాలు చెయ్యటంతో, కూలీనాలీ దొరక్క రోడ్డున పడ్డవాళ్లు. పురుషులకే కూలీ దొరకలేదంటే స్త్రీలు, పిల్లల పరిస్థితి మరీ అధ్వాన్నం. వెరసి, కూలీరేట్లు తగ్గి వాళ్లు బతకలేని పరిస్థితి ఏర్పడింది. ఇక, హెగెల్‌ను విమర్శిస్తూ, కేవలం సిద్ధాంత బలం మీద విప్లవం రాదు. అన్యాయానికి తిరగబడ్డ కార్మికవర్గం, విప్లవ సిద్ధాంతాన్ని ఆయుధంగా మలచుకుని ఉద్యమించినప్పుడే అది సాధ్యం అని స్పష్టం చేశాడు' ఈ విముక్తి కార్యాచరణకు తల... (మేధోశక్తి) తాత్విక సిద్ధాంతం. దీని ఆత్మ... కార్మికవర్గం.

(సశేషం)

బహుళరాగం

■ కథ : విహారి

ఇంత దగా చేస్తుందనుకోలేదు.

ఇంత దుర్మార్గంగా ప్రవర్తిస్తుందనీ అనుకోలేదు.

ఇంతగా కక్ష సాధిస్తుందనుకోలేదు.

ఇంతగా నాకు దుఃఖాన్నీ, విచారాన్నీ చుట్టు బెడుతుందనీ అనుకోలేదు.

***

అప్పుడు–

నదిని చూస్తుంటే తలపుల వెల్లువ. ఉద్వేగం. భావావేశం. భావనా రసాయనాల మిశ్రమం.

అది ఒక నాగరికత! ఒక శౌర్యం! ఒక ధైర్యం! ఒక ఆత్మస్థైర్యం! ఒక ప్రాణధార! ఒక జీవనాధారం!

ఇన్నిటి ప్రతిరూపంగా పక్కన సుందర్! తలపుల వెల్లువలోని విద్యుత్తరంగం. విద్యుత్తరంగంలోని వేగం, ఆ వేగం!

ప్రవహిస్తున్న కవితాక్షరాల్లా ఆనందాన్ని పటిష్టం చేస్తున్నాడు. అనుభవాన్ని రగులుస్తున్నాడు. అనుభూతికి పారవశ్యాన్ని కల్పిస్తున్నాడు. అనిర్వచనీయతకి ఆకాశ స్ఫురణమిస్తున్నాడు.

అతని సమక్షంలో–

అతని సుముఖంలో–

మనసూ, మేధా కూడా వర్షాంబుదాల్ని మోస్తున్నై.

ఆర్ద్రంగా, ఆత్మీయంగా,

ఎన్నెన్ని మధుమాలికలు? ఎన్నెన్ని 'స్వీట్ నథింగ్స్'!

ప్రకాశం బేరేజి ఇవతల పార్కులో– పొదరిల్లు వెనగ్గా– తన వొడిలో సుందర్. కళ్లల్లో కళ్లు పెట్టి చూపులు...

'మానస పేరుకంటే మంచి పేరు పెట్టుకుందాం' అతనన్నాడు.

ఉలిక్కిపడింది. వెంటనే, 'మనస్విని' అంటాన్నేను. అదే ఖాయం. శుభలేఖల్లో కూడా ఎలియాస్ నేమ్ వేయిస్తాను.' సుందర మందహాసం!

చల్లగాలికంటే చల్లని మాటలు. గాలి ఈలకంటే మత్తుగా అనురాగ ప్రస్తారం. లాలనతో కూడిన అభ్యర్థన! 'అదృష్టం అంటే ఇతన్ని జీవన సహచరుడుగా పొందటమే నేమో!' ఒక హాయి. ఒక మెరుపు. ఒక ఆహ్లాదపు తునుక! తమకంగా చూపుల కలయిక, నిశ్శబ్దంగా– మౌనరాగాల జుగల్‌బందీ! అవును. సుందర్ సుందరత్వం తనని బందీని చేసేసింది.

కొండంత సాత్వికతానందంతో గుండె బరువెక్కింది.

పరస్పర మృదుస్పర్శలు, అలవోక కరచాలనాలు, పెదవుల కదలిక... బిడియం... వెనకడుగు...

'ఓ.కే. మావాళ్లందరూ గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు కనుక, బి.రెడీ...'

అవును. అతనికి అందరూ వున్నారు. తండ్రి రంగనాథం. చెన్నై టీవీయస్‌లో ఉద్యోగి. తల్లి శాంతమ్మ. హోమ్ మేకర్. అన్న అరవింద్ హైదరాబాద్‌లో ఏదో కంపెనీలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్. వదిన నళిని టీచర్. అక్క చందన ఎంఎన్‌సిలో చిన్న ఉద్యోగం. ఆమె భర్త రాఘవ ఇంజనీర్. వాళ్లది బెంగుళూరు. అందరూ 'చూశారు' తనని. నిజంగా ఆప్యాయతని వర్షించారు. అత్తింటి వారు– అంత మన్ననని అందించటం అరుదైన విషయం. అదో అదృష్టం. శాంతమ్మ పాటికి పదిసార్లు 'తల్లీతండ్రీ లేని పిల్లవు. నా మూడో కూతురువి నువ్వే' అని మురిసిపోయింది. ఆమెకు కోడలు రెండో కూతురుట!

మనసంతా పూతతో విరగబడుతున్న మావిడిలా అయింది!

***

ఇప్పుడు–

నదిగట్టున కూచుని శూన్యంలోకి చూస్తూ చూస్తూ, చూపు మరల్చిన నదినే చూస్తుంటే,

అది– సుళ్లు తిరుగుతూ ప్రవహిస్తూ పోతూనే వుంది, నంగనాచిలా.

శబ్ద నిశ్శబ్దాల విమోహిలాంటి ఆ సుడి విన్యాసానికీ, విన్నాణానికీ కలిపి, ఆ రొదకి– నా 'ఘోష'ని తిరగమోతవేద్దామనిపిస్తోంది. అవ్యక్త విషాదం. కినుక. కాదు కసి. అదీకాదు నిస్సహాయత విసురుతున్న మౌన ఆగ్రహం!

చేయవలసిన దగా చేసేసి చల్లగా జారుకుంది ప్రవహిస్తోంది. ఒడ్డుల్ని వొరసుకుంటూ రాగాలు తీస్తూ సాగిపోతోంది.

***

"నువ్వు నాన్నని పిలిపిస్తే బాగుంటుందమ్మా"

గతుక్కుమంది. కళ్లు విచ్చుకుని దిగ్భ్రమగా చూసింది. ఎదిగిన కొడుకు. విజయ్. ఇరవై ఏళ్లవాడు చెబుతున్నాడు.

"అవునమ్మా. నువ్వేమన్నా అనుకో. నా మనసుకు తోచింది చెప్తున్నాను"

ఆ మాటలు అని, బ్యాగ్ భుజానికి వేసుకుని, నిమ్మళంగా గడపదాటి వెళ్లిపోయా డతను. నిలిచి తల్లి కళ్లల్లోకి చూసే ధైర్యం చాల్లేదు కాబోలు. ఫ్రెండింట్లో చదువుకుంటాడు. అందుకూ– ఈ వెళ్లటం. అవును. తల్లి ఏమిటో, జరిగిన వాస్తవాలేమిటో అతనికి తెలుసు మరి. అంతకంటే ఎలా చెప్పగలడు?

'నువ్వేమన్నా అనుకో...' అనుకోవటానికి ఇవ్వాళ ప్రత్యేకంగా మిగిలిన అభిప్రాయ శకలాలేమున్నై తన దగ్గర.

లేచి లైటార్పింది.

చీకటి భయపెట్టే రోజులు పోయాయి. చీకటి చెప్పిన పాఠాలు వినటానికి బాగానే అలవాటుపడింది. కీచురాయి బతుకు! దానికీ యిప్పుడు బద్ధకంగా వుంది!

గోడమీద నీడలు... గత సంభవాల జాడలు... అనుభవాల పీడలు... కదులుతున్నై.

***

సాఫీగా సాగుతున్న బతుకు శ్రుతిలో ఒక అపస్వరం. సుందర్‌కి ఒక్కడికీ విజయవాడనుంచీ హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్. తనకు కూడా ప్రయత్నిద్దామంటే విజయ్ చదువు అడ్డొచ్చింది.

సుందర్ భాగ్యనగరం చేరాడు. అదే తన బతుకు పుస్తకంలో అభాగ్య

అధ్యాయమైంది.

ఒంటరిగా రూమ్ తీసుకుని నివాసం మొదలెట్టాడు. అన్నావదినా తమ యింట్లో వుండమంటే తనకు 'ఫ్రీ'గా వుండదన్నాడు. రోజులు గడుస్తున్నై. తొలిరోజుల్లో పదిహేను ఇరవై రోజులకి విజయవాడ వచ్చేవాడు. క్రమేపీ వ్యవధి పెరిగింది. నెల, నెలాపదిహేను రోజులు, రెణ్ణెల్లు...

మనిషిలో మార్పు..

మనసులో మార్పు...

మాట తీరులో మార్పు....

అతని జీతంతో అతని ఖర్చు. అదేమీ సమస్య కాలేదు. తన జీతం వుంది తనకు. తానూ బ్యాంక్‌లో ఉద్యోగిని.

సెలవు పెట్టి హైదరాబాద్ వెళ్లింది. అరవింద్‌నీ, నళినినీ విచారిస్తే, వాళ్లు బాధగా "సుందర్ గాడి తప్పా'డన్నారు.

ఎంత మొత్తుకున్నా తాను చెప్పడు. బంగారంలాంటి ఉద్యోగం పట్ల నిర్లక్ష్యం. వెళ్లీ వెళ్లకా ఆఫీసర్లకీ విసుగు తెప్పిస్తున్నాడు. వాళ్లూ సానుభూతి మాటలు మాట్లాడి పంపించారు. సుందర్‌లాంటి వాడు తాగుబోతు కావటమా?!

ఎట్లా అబ్బిందీ అలవాటు?

అందరూ పరిచయస్థులే. ఎవ్వరూ చెప్పరు. ఏమీ చెయ్యలేని నిస్సహాయత.

నళిని చెప్పిందోసారి. ఒక రాత్రి తూలుతూ, వాగుతూ వచ్చాట్ట వాళ్లింటికి. అరవింద్ టూర్‌లో వున్నాట్ట. డబ్బు కావాలన్నాట్ట సుందర్. ఆమెకి భయమూ, సందేహమూ... చివరికి నాలుగువేలిచ్చి పంపిందట. 'నువ్ బాధపడతావని చెప్పొద్దన్నారు మానసా, మీ బావగారు' అన్నది.

తాను హైదరాబాద్ వెళ్లి ఘర్షణ పడింది. అతను విజయవాడ వస్తే, అసలు బొమ్మ స్ఫుటంగా కనిపించింది.

ఒక రాత్రి. ఇంకో రాత్రి.. మరో రాత్రి...

అదే దృశ్యం. అదే పరిస్థితి. 'నువ్ లేనిది నాకు యుగంతో సమానం మనస్' అని గువ్వలా తనలో వొదిగిపోయిన ప్రేమోన్మాదికి తన సాన్నిహిత్యం అక్కర్లేకుండా పోయింది. ఇంక సంయోగాన్నేం ఆశిస్తాడు?!

ఒక పగలు... ఒక సాయంత్రం... ఒక రాత్రి... ఒకరోజు... మరో-ది..నం! అన్నీ ఒక్కటే. అంతా ఒక్కటే. ఒక్కటే ప్రపంచం. అతనికి అదే లోకం. 'మందు'..! విస్తృతంగా వినివిని, కథలూ గాథలూ చదివి చదివి, సినిమాలూ సీరియళ్లూ చూసిచూసి- ఆ పదమూ, పరిస్థితీ మరీ 'ఫెమిలియర్' అయిపోయి భావరాహిత్యాన్ని కలిగించాయి కానీ,

అనుభవంలో కొచ్చేసరికీ ఆ నరకం ఎంత దుర్భరమో, ఆ మనిషిని భరించటం ఎంత దుస్సహమో పూర్తిగా అర్థమైంది. శ్రీదేవీమురళీధర్ పుస్తకం, అక్షరాలూ కళ్లముందు కదలాడుతూ వున్నై. 'ఏమిటమ్మా- ఈ పరిస్థితి?' అని మూగకళ్లతో ప్రశ్నించేవాడు విజయ్. గ్రాయకం తెలిసిన కొడుక్కి ఏం చెప్పగలదు?

ట్రాన్స్‌ఫర్‌కి ప్రయత్నించింది. ఫలించలేదు.

సుందర్‌ని ఆ వ్యసనం పూర్తిగా లోగొన్నది.

జీవిత గమనమూ, గతీ మారిపోయినై. అనంతమైన నిస్పృహ, నైరాశ్యం మనసు మీద దాడి చేసినై.

నిద్రాహారాలు కరువైనై. బతుకంటే ఉదాసీనత. ఉద్యోగ బాధ్యతని తప్పనిసరి తద్దినంలా నెరవేర్చటం. అలసత్వానికి అధికారుల హెచ్చరికలు.

సుందర్ తల్లిదండ్రుల్ని పిలిపించింది. మాటలు. చర్చలు. వేడికోళ్లు. హామీలు. వేటికీ విలువలేదు. నిలకడలేదు.

మనుషుల్లో జీవంలేని చలనం. గాలికి ఎగిరే చిత్తుకాగితాల్లా దినచర్య. రాకలూ, పోకలూ... 'విజయవాడ టు హైదరాబాద్ ఆన్‌వర్డ్ అండ్ రిటర్న్ జర్నీలు-' ఎవరిదో జోక్!

రంగనాథం ఎంతో ప్రయాసతో హైదరాబాద్‌కి ట్రాన్స్‌ఫర్ సాధించుకున్నాడు. ఇల్లు చూసుకుని సెటిలయ్యారు. కొడుకుని తెచ్చుకుని ఇంట్లో వుంచుకున్నారు. సుందర్ కోసం ఒక గదిని కేటాయించారు. వైద్యం చేయించసాగారు.

భగవద్గీతలో చెప్పినట్లు తనను తాను ఉద్ధరించుకోవాలనే ఇచ్ఛలేనివాడికి ఎవరి సహాయమైనా ఎందుకు ఉపయోగిస్తుంది?

అర్ధరాత్రో, అపరాత్రో రావటం. తూలుడూ, వాగుడూ, వో మూల వాలిపోవటం.

ఫోన్‌లో అటు శాంతమ్మ, ఇటు మానస- ఆవేదన, దుఃఖం, విచారం, ఏడుపు.

అసలీ అలవాటెలా అబ్బింది సుందర్‌కి. వ్యసనంగా ఎలా మారింది? ఏవేవో చెప్పేవాడు. పార్టీలు... కాలక్షేపం... ఇంకా గట్టిగా కోపంతో, అరుపుతో, విసుగుతో, ఏడిస్తే- ముఖశూన్యుడిలా 'నువ్వు లేకుండా నేనుండలేకపోయాను' అని తానూ కళ్లనీళ్లు పెట్టుకోవటం.

సిగ్గుపడేది. బాధ కలిగేది. మాటలు పెరిగేవి కావు. మనసు వికలమైపోయేది. అదొక విషాద హేమంతం, విధ్వంస గ్రీష్మం!

సహోద్యోగులూ, సన్నిహితులైన స్నేహితురాండ్రూ-

'మామూలు కథే గదా' అనే పెదవి విరుపు. ఒకరిద్దరైతే నువ్వెంత గ్లోరిఫై

చేసినా- అతనొక రోగ్- అని ఈసడించుకున్నారు.

నిముషాల్ని శిథిలం చేస్తూ రోజులు ముందుకు పోతున్నాయి.

***

బ్యాంక్‌లో అందరూ మంచివారే. రూల్సే మంచివికావు.

ఉద్యోగం ఊడింది.

రంగనాథం, శాంతమ్మా గొల్లుమన్నారు. మానస కూడా వెళ్లింది. అన్నావదినా బాధపడ్డారు. అక్కాబావా వచ్చారు. రాఘవ ఆశ్చర్యంలోనూ, హితైషిగా 'ఇంత విడ్డూరం ఎక్కడా చూడలేదు. కంచంలో కూడుని తోసేసుకున్నాడు' అని విచారించాడు.

"బంగారంలాంటి మనిషి. మనసు మంచిది. బుద్ధీ జ్ఞానం వున్నై. వివేకాన్నే కోల్పోయాడు. ఎన్విరాన్‌మెంట్ ఎంత పనిచేస్తుందో చూపటానికి బెస్ట్ ఎగ్జాంపుల్. బ్యాడ్ లక్" అని మానసని అనునయించాడు.

పది పదిహేనురోజులు ఇట్టే గడిచిపోయాయి. రావలసిన డబ్బుని సెటిల్ చేసేశారు- బ్యాంక్ వాళ్లు. సుందర్‌కి పెన్షన్‌కి అర్హత లేదు.

విజయవాడ రమ్మంటే 'నువ్ వెళ్లు, నేను నాల్రోజుల్లో వస్తా'నని మానసని పంపించేశాడు.

వారంరోజులు తిరిగేసరికీ- సుందర్ పత్తాలేడు.

గుండెలు చిక్కపట్టుకుని తెలిసిన ప్రదేశాలన్నీ గాలించారు. అటు అమ్మానాన్నా, అన్నావదినా, అక్కాబావా, ఇటు మానసా, విజయ్-

అయినవాళ్లనీ కానివాళ్లనీ విచారించారు. ఆచూకీ చిక్కలేదు.

ఉన్నట్టుండి వోరోజు–

మానసని పక్కకి తీసుకుపోయి చెప్పింది వెంకమ్మ. 'సుందర్‌గారు మా బస్తీలో వుంటున్నారమ్మా' అని.

స్తంభించిపోయింది. వెంకమ్మ ఆ బ్యాంక్‌లో గ్రూప్‌డి ఎంప్లాయి.

ఆ సాయంత్రం–

విజయ్, మానసా, వెంకమ్మని తీసుకుని వెళ్లారు.

మురికివాడ. గల్లీలూ, సందులూ గడిచి నడిచారు. రేకుల టిక్కీలాంటి గది! మసిబొంతలా ముడుచుకు పడుకుని వున్నాడు సుందర్! మానస కళ్లల్లో చెమ్మ యింకిపోయింది. గుండెల్లో తడి ఎప్పుడో ఆరిపోయింది. విజయ్ కళ్లల్లో నీరు.

లేపి కూర్చోబెట్టారు. కళ్లు తెరిచి చూశాడు. చూపు నిలవటంలేదు. తలవాలి పోతోంది. నేలమీద కూర్చుంది మానస. ఒడిలో తలపెట్టుకుని అతన్ని కళ్లతోనే ప్రశ్నిం చింది. సుందర్ స్పందన ఒక నిర్జీవ దృక్కు. ఆ కళ్లల్లోకి చూసింది. ఎన్నోసార్లు తన వొడిలో పరవశించిన సుందర్ తల నిలిచీ నిలవక వాలిపోతోంది.

విజయ్ ఏడుపుని దిగమింగుకుంటున్నాడు.

గుండెను బిగించిన వేదనతో అన్నది, "రండి మనింటికి వెళ్దాం"

పేలవమైన నవ్వు. "వద్దు. మీరు భరించలేరు. లీవ్‌మీ. ఈ బతుక్కి ఇదే సరైన ప్లేస్" అని మొహం తిప్పుకున్నాడు.

గంటల తరబడి వేడికోలు. చర్చ. వొప్పుదల రాలేదు.

భారంగా తిరిగి వచ్చేశారు. ఆ రాత్రికి భోజనం తెచ్చాడు విజయ్.

ప్రతిరోజూ– వెళ్లటం, రావటం, రానేరానని భీష్మించుకున్నాడు. అన్ని అర్థింపులూ గాలిలో కలిశాయి.

***

ప్రతీక్షణలోనూ, నిరీక్షణలోనూ రోజులు గడిచిపోతున్నై.

ఇన్నాళ్లకిన్నాళ్లకి–

అన్నీ తెలిసిన విజయ్ 'నాన్నని పిలిపిస్తే బావుంటుందమ్మా' అంటున్నాడు. వాడికి మాటలు తడబడినట్టున్నై. పిలిపించటంకాదు, ఫిజికల్‌గా పట్టుకొచ్చేయటం...!

అన్నీ దురదృష్టపు పాదముద్రలు...

మనసు పరిపరి విధాల పోయింది. ఎంత వద్దనుకున్నా కీడునే శంకించింది.

ఇద్దరూ కలిసి వెళ్లారు పక్కన విజయ్ ఫ్రెండ్.

సుందర్ అసలు ఈ లోకంలో లేడు. గంటక్రితం ఆ రేకుల టిక్కీ ముందు గల్లీలో పడిపోతే, ఎవరో చూసి గదిలోకి చేర్చారట. నలుగురూ చేరారు. ఎవరో అంటున్నారు "నాటులోకి దిగితే ఇంతే. ఇదంతా మామూలు బాగోతమే"

ఆటోరిక్షాలోకి ఎక్కించి ఇంటికొచ్చి పడ్డారు.

మానస లాంగ్‌లీవ్ పెట్టింది. ముందు గదిలో అతనికి ప్రత్యేకంగా బెడ్. బ్యాంక్ పాస్‌బుక్‌లూ, ఎక్కౌంట్లూ చూస్తే చిల్లరమల్లర తప్ప వచ్చిన డబ్బంతా హరించుకుపోయింది.

నాలుగు రోజులు కదిలాయి.

ఆ రాత్రి రక్త విరేచనాలు. వాంతి. భరించలేని దుర్వాసన. విజయ్ తత్తరపడ్డాడు. కలవరపడ్డాడు. భయపడ్డాడు. హాస్పటల్‌లో చేర్చారు. "ఇట్సే గాన్ కేస్. మీ సంతృప్తికోసం వైద్యం" అన్నాడు డాక్టర్.

మూడు రాత్రులు నరకయాతన పడ్డాడు. భార్యనీ, కొడుకునీ కూడా నరకయాతన పెట్టాడు.

తెల్లవారు ఝామున మూడుగంటలకి– మృత్యువుకి తలవొగ్గాడు సుందర్. లక్ష్య మూ, గమ్యమూ తెలియని ప్రాణ హంస లేచిపోయింది.

***

'ఇంతగా దగా చేస్తుందనుకోలేదు!' అని మళ్లీ వగచింది మానస.

జరగాల్సిన కర్మకాండ జరిగింది. ఆ కార్యక్రమాలన్నిటా మానస అత్తమామల దూరపు బంధువు– 'గోపాలం'!

ఎప్పటివాడు? ఇరవైమూడేళ్లనాడు బ్యాంక్ ఆఫీస్‌లో తొలి అడుగు పెడుతున్నప్పుడు పక్కగా వచ్చి తన వెనగ్గా నిలిచిన గోపాలం! తన పని అయిన తర్వాత, అతని రిపోర్టింగ్. కొద్దిపాటి సంక్షిప్త పరిచయం. ఇద్దరికీ వేర్వేరు ఆఫీసుల్లో పోస్టింగ్‌లు. అదేవూరు. ఇన్నేళ్లకిన్నేళ్లకి– ఇప్పుడు– ఇక్కడ!

ఎవరి ప్రాధాన్యతలు వారివి. ఎటువారటు వెళ్లిపోయారు.

ఒంటరి దుఃఖం మిగిలింది. విజయ్? వాడిదొక లోకం. నెలలు గడుస్తున్నై.

అద్దంలో పుస్తకంలా తిరగబడిన రాత! చేసిన గాయాన్ని కెలుకుతూ సంవత్సరీ కాలు. ఆ తంతు ముగిసింది.

***

రంగనాథం, శాంతమ్మా విజయవాడ వచ్చారు. వచ్చిన రెండో రోజు రాత్రి–

విజయ్ సమక్షంలోనే గోపాలం ప్రసక్తి. 'నీకు తెలుసా?' ప్రశ్నతో ఆ తెలియని విషయాలన్నిటినీ వివరించారు.

తొలి యవ్వనంలో గోపాలం– మానసని చూసి ఈమెని చేసుకుంటే బాగుణ్ణు అనుకున్నాడు. తల్లీ, ఇద్దరు చెల్లెళ్ల పెళ్లి బాధ్యత– ఆకాంక్షని మనోగతం చేసినై. ఆ తర్వాత కర్నాటకకి ట్రాన్స్‌ఫర్. తిరిగితిరిగి వచ్చి బాధ్యతలు పూర్తి చేసుకున్న తర్వాత, తన కోసం తాను నిలబడి విచారించుకుంటే– మానస పిల్లవాడి తల్లి! అవ్యక్త మాధుర్య భార్యాన్ని మోస్తూ అలాగే మిగిలిపోయాడు.

ఇంతా చెప్పి శాంతమ్మ అన్నది, "అతను నీపట్ల ఇప్పటికీ ఆ ఆరాధనా భావంతోనే వున్నాడు"

ఉలిక్కిపడింది మానస! ఏవిటీ సినిమా డైలాగ్?!

***

చేసినదంతా చేసి మలుపు తిరిగి నిలిచింది! మానసకి నదిని చూస్తుంటే– ఇంత ఇంత బతుకు గమనం గుర్తుకొచ్చింది.

అష్టదిక్కులా ఆనందం ఆవరించుకుందనుకున్న బతుకు– మామూలు తాగుబోతు కథకి అంకితమైపోయింది.

ఇవాళ ఇలా మిగిలి, మిగిలిన విజయ్ బాధ్యతలో ఊరడిల్లుదామంటే–

విజయ్‌తోసహా అందరూ– విస్మరణ పాఠం చెబుతున్నారు. సాధారణ ప్రేమకథకి నాయికని కమ్మంటున్నారు.

సుందర్ కుటుంబ సభ్యులూ, విజయ్ వసంతాన్ని దోసిళ్లతో పట్టుకుని నిలిచారు. 'మాకోసం ఒప్పుకో'మంటున్నారు. 'నీకోసం మేము' అంటున్నారు. 'రేపు నీ నలభైమూడో బర్త్‌డే' అన్నాడు విజయ్! అంతర్ముఖ విశ్రాంత లోకంలోకి పోయి కూర్చుని, తీరిగ్గా ఆలోచిస్తోంది. ఒక ప్రశ్నా, పది సమాధానాలూ...

అయినవారన్న ప్రతివారూ– కొత్త అధ్యాయానికి ఆముఖాన్ని కూర్చటం– ఇదీ చిత్రంగా వున్న సందర్భం! అన్ని ఆంతర్యాలూ ఏకోన్ముఖంగా వెలుగు కిరణాన్ని అను సరించటం అరుదైన చిత్రమే! అక్కడ బహుముఖాల్లో ఒక ముఖం– గోపాలం!

కళ్లు విచ్చుకుని చూస్తూనే వుంది మానస!!

రచయిత సెల్ :9848025600

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

వాట్స్‌యాప్ వాడుతున్నారా?

వాట్స్‌యాప్... ఇదొక ఇంటర్నెట్ ఆధారిత సాఫ్ట్‌వేర్. స్మార్ట్‌ఫోన్ వినియోగిస్తున్న ప్రతి ఒక్కరికి సుపరిచితమైన అప్లికేషన్. దీనిద్వారా మొబైల్ ఫోన్ వినియోగదారులు చాలా సులువుగా టెక్స్ట్, వాయిస్ మెసేజ్‌లతో పాటు వీడియోలు, ఫోటోలు ఏవైనా సరే షేర్ చేసుకునేందుకు ఈ యాప్ వీలుకల్పిస్తుంది. దీనికి టెలిఫోన్ ఆపరేటర్ల నుంచి ఎలాంటి చార్జీలు ఉండవు. నిన్నమొన్నటి వరకు ఫేస్‌బుక్, ట్విట్టర్ లాంటి సోషల్ నెట్‌వర్క్ సైట్ల పేర్లు ప్రముఖంగా వినిపిస్తే, ఇప్పుడంతా వాట్స్‌యాప్ అంటున్నారు. ప్రపంచంలో ఏ మూలనుంచైనా ఈ యాప్‌ను ఉపయోగించొచ్చు. ఫోన్ లేదా ట్యాబ్‌లో కేవలం ఇంటర్నెట్ సదుపాయం ఉంటే చాలు. వీడియో, ఆడియో ఫైల్స్‌తోపాటు సమాచారాన్ని, ఫోటోలను క్షణాల్లో కోరుకున్న వారికి పంపేయొచ్చు. ఒకరినుంచి మరొకరు షేర్ చేసుకోవచ్చు. తొలి ఏడాది పాటు ఈ యాప్‌ను ఉచితంగానే వాడుకోవచ్చు. ఆ తర్వాత మాత్రం ఏడాదికి ఒక డాలరు చొప్పున చెల్లించాలని వాట్స్‌యాప్ చెబుతోంది. ప్రస్తుతం వాట్స్ యాప్ వాడని స్మార్ట్‌ఫోన్ లేదంటే అతిశయోక్తి కాదు.

మెసేజ్‌లు, ఫోటోలు, వీడియోలు షేర్ చేయడం ఇప్పుడొక అలవాటుగా మారింది. వాట్స్ యాప్ ద్వారా షేర్ చేసే సమాచారం అంత సురక్షితం కాదని, వాటిని మనం షేర్ చేస్తున్న వారే కాకుండా, ఇతరులు సైతం చూసేందుకు, యాక్సెస్ చేసేందుకు అవకాశముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వాట్స్ యాప్‌లో మనం షేర్ చేస్తున్న ఫోటోలు, వీడియోలు, డేటాను ఇతరులు కూడా యాక్సెస్ చేసుకునే అవకాశముందని ఇటీవల ఓ సెక్యూరిటీ సంస్థ వెల్లడించిన విషయం తెలిసిందే. మెసేజ్‌లు ఎక్స్ఛేంజ్ చేసేటప్పుడు ఉపయోగించే ఎన్‌క్రిప్షన్ కోడ్స్, మన ఫోన్‌లోని ఎస్‌డి కార్డులో సేవ్ అవుతాయి. ఈ కోడ్స్‌ను ఇతర ఆండ్రాయిడ్ యాప్స్ ద్వారా డీకోడ్ చేసే అవకాశముందట. ఇంటర్నెట్ ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న హ్యాకింగ్ భూతం ఈ లోపాలను అవకాశంగా తీసుకొని ముఖ్యమైన డేటాను తస్కరించే అవకాశం వుందని, వాట్స్ యాప్ వినియోగదార్లు తగు జాగ్రత్తలు తీసుకోక తప్పదని నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాతిగాంచిన ఈ వాట్స్‌యాప్ అప్లికేషన్ వినియోగదార్ల సంఖ్య 50కోట్లను అధిగమించింది. ఉక్రెయిన్‌కు చెందిన జాన్ కౌమ్, బ్రియాన్ యాక్టన్ అనే అమెరికన్ కలిసి 2009లో ఈ యాప్ సేవలను ఆరంభించారు. మొబైల్స్, ట్యాబ్లెట్ పీసీలద్వారా సులువుగా మెసేజ్‌లు, ఫోటోలు, వీడియోలు షేర్ చేసుకునేందుకు వీలు కల్పిస్తున్న వాట్స్‌యాప్‌కు అనతికాలంలో విశేష ప్రాచుర్యం లభించింది. దీంతో సోషల్ నెట్‌వర్కింగ్ దిగ్గజం ఫేస్‌బుక్ ఈ ఏడాది ఫిబ్రవరిలో దీనిని 19 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.1.15 లక్షల కోట్లు) భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. ప్రతిరోజూ 70 కోట్ల ఫోటోలు, 10 కోట్ల వీడియోలు, 1,000 కోట్లకు పైగా మెసేజ్‌లు దీనిద్వారా షేర్ అవుతున్నాయని, 10లక్షల మంది కొత్త వినియోగదార్లు జతవుతున్నారని అంచనా. అంతేకాదు, వాట్స్‌యాప్ వినియోగదార్లలో 70శాతం మంది యాక్టివ్ వినియోగదార్లు కావడం విశేషం.

ఈ యాప్ ఇప్పుడు ఫేస్‌బుక్‌ను బీట్ చేసే రేంజ్‌కు ఎదిగింది. మొన్నటి వరకు స్మార్ట్‌ఫోన్ వినియోగదార్లు చాటింగ్ చేయాలంటే ఫేస్‌బుక్ పైనే ఆధారపడేవారు. కానీ ఇప్పుడు అంతా వాట్స్ యాప్‌కు కనెక్ట్ అవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 50కోట్ల వినియోగదార్లుంటే, మనదేశంలో నాలుగున్నర కోట్ల మంది ఉండటం విశేషం. ఫిబ్రవరిలో ఫేస్‌బుక్ ఈ యాప్‌ను కొన్నప్పుడు 19కోట్ల వినియోగదార్లుంటే, ఇప్పుడా సంఖ్య 50 కోట్లకు చేరింది. దీన్నిబట్టి ఈ యాప్‌కు ఎంత క్రేజ్ ఉందో చెప్పొచ్చు. ఈ యాప్‌కు బ్రెజిల్, మెక్సికో, రష్యా, ఇండియాలోనే ఎక్కువ వినియోగదార్లు ఉన్నారని ఆ సంస్థ చెబుతోంది.

ఎంత పాపులారిటీ వున్నా ఈ యాప్‌కు సైతం హ్యాకింగ్ గొడవ తప్పడంలేదు. వేలాది రూపాయలతో కొన్న స్మార్ట్‌ఫోన్లు, అందులోని సమాచారం సురక్షితంగా వుండాలంటే తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే.

జాగ్రత్తలు :

– మీ స్మార్ట్‌ఫోన్‌లోని వాట్స్ యాప్ సందేశాలను లాక్ చేయటం ద్వారా మీ వాట్స్‌యాప్ అకౌంట్ సెక్యూరిటీని మరింత పటిష్టం చేయవచ్చు. ఇందుకు గూగుల్‌ప్లే స్టోర్‌లో 'వాట్స్‌యాప్ లాక్' పేరుతో ఓ ఉచిత యాప్ లభ్యమవుతోంది. ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా వాట్స్‌యాప్ మెసేజ్‌లను లాక్ చేసుకోవచ్చు.

– స్మార్ట్‌ఫోన్ యాప్‌ను రీఇన్‌స్టాల్ చేసిన సమయంలో కొన్నిసార్లు పాత సంభాషణలు కనిపించకుండా పోతుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ఆండ్రాయిడ్ వినియోగదార్లు వాట్స్‌యాప్ సెట్టింగ్స్‌లోని చాట్ సెట్టింగ్స్‌ను సెలక్ట్ చేసుకుని చాట్ సంభాషణ ఆప్షన్‌ను ఎంపిక చేసుకుంటే పాత సంభాషణలను తిరిగి పొందొచ్చు.

– పబ్లిక్ వై–ఫైకు దూరంగా ఉండంతో పాటు గుర్తు తెలియని నంబర్లను బ్లాక్ చేయాలి. దీంతోపాటు మీ వై–ఫైకు పటిష్టమైన పాస్‌వర్డ్‌ను పెట్టుకోవాలి.

రచయిత సెల్ : 9490099219



జీవితంలో ఎత్తుపల్లాలను దాటుకొంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించిన అతికొద్ది మందిలో ఆల్‌టైమ్ బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలీ ఒకరు. జాతి వివక్ష ఎదురైనా, అమెరికా ప్రభుత్వం నిషేధం విధించినా, పార్కిన్‌సన్స్ వ్యాధి బాధించినా ఆయన ఏనాడు కుంగిపోలేదు. అవరోధాలను అన్నింటిని సవాళ్లుగా స్వీకరించి రెట్టించిన ఉత్సాహంతో ముందుకు సాగారు. మరే క్రీడాకారునికి సాధ్యం కాని విజయాల్నీ, రికార్డుల్నీ సొంతం చేసుకున్న అలీ, నేడు అతి మతిమరపు వ్యాధితో కదల్లేని, మాట్లాడలేని స్థితిలో ఉన్నారు. క్రీడాకారునిగా, హక్కుల కార్యకర్తగా, శాంతి దూతగా ఎందరికో ఆదర్శంగా నిలిచిన మహ్మద్ అలీపై ప్రత్యేక కథనం...

బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలీ

మహ్మద్ అలీ..ఈపేరు వినగానే బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులకు చెమటలు పడతాయి. అసాధారణ బాక్సింగ్‌తో ఈశతాబ్దపు క్రీడాకారుడిగా ప్రశంసలందుకొన్న మహ్మద్ అలీ..నేడు దీర్ఘకాలిక వ్యాధి కారణంగా చావుతో పోరాడుతున్నాడు. పార్కిన్‌సన్స్ వ్యాధితో సుమారు 30 ఏళ్లుగా బాధపడుతోన్నాడు. బాక్సింగ్ రింగ్‌లో తనదైన పంచ్‌లతో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన మహ్మద్ అలీ..నేడు పార్కిన్‌సన్స్ వ్యాధి మూలంగా కదల్లేని స్థితిలో నిస్తేజంగా ఉండటం బాధాకరం. 72 ఏళ్ల మహ్మద్ అలీ..కేవలం ఉదయపు వేళల్లో మాత్రమే కొన్ని సంజ్ఞల ద్వారా మాట్లాడగలుతున్నాడని సమాచారం. తన జీవిత ఇతివృత్తం ఆధారంగా తెరకెక్కిన హాలీవుడ్ సినిమా ' ఐ యామ్ అలీ' ప్రీవ్యూకు కూడా ఆయన రాలేదు. పార్కిన్‌సన్స్ బాక్సర్లకు సాధారణంగా వచ్చే వ్యాధియే. అలాగే ప్రత్యర్థుల పిడిగుద్దుల బారిన పడి..ఇలా వృద్ధాప్యంలో నరకయాతన అనుభవిస్తున్న బాక్సర్లు లెక్కకు మించి ఉన్నారు. బాక్సింగ్ రింగ్ నుంచి వైదొలిగినా.. గొప్ప మానవతావాది, సాంఘిక కార్యకర్త, ఐరాస శాంతిదూత, జాతి, వర్ణ హక్కుల కార్యకర్తగా మహ్మద్ అలీ సమాజంతో నిత్యం పోరాటం చేశాడు. విచిత్రమేమిటంటే..బాక్సింగ్ రింగ్‌లో మహ్మద్ అలీతో తలపడిన బాక్సర్లు కూడా విపరీత అనారోగ్య కారణాలతో బాధపడుతున్నారు. జోయ్ ఫ్రెజర్, లియోన్ స్పింక్స్, లారీ హోల్మ్స్‌లు వివిధ రకాల వ్యాధులతో బతుకు పోరాటం చేస్తున్నారు.

12 ఏళ్లకే బాక్సింగ్ రింగ్‌లోకి : క్లాసియస్ మర్సిలస్ క్లే జూనియర్ (మహ్మద్ అలీ) 12 ఏళ్లకే బాక్సింగ్ సాధనలో నిమగ్నమయ్యాడు. అలీ..ఆఫ్రికన్-అమెరికా మధ్య తరగతి కుటుంబం నేపథ్యం నుంచి వచ్చాడు. అలీకి ఒక సోదరి, నలుగురు సోదరులు. లూయిస్ విల్లేకు చెందిన పోలీస్ ఆఫీసర్, బాక్సింగ్ కోచ్ 'జోయ్ ఈ మార్టిన్' తొలుత అలీ ప్రతిభను గుర్తించి శిక్షణ ఇచ్చాడు. మార్టిన్ శిక్షణలో రాటుదేలిన అలీ ఆరు కెంట్యూకీ గోల్డెన్ గ్లోవ్స్ టైటిల్స్, రెండు నేషనల్ గోల్డెన్ గ్లోవ్స్, అథ్లెటిక్స్ యూనియన్ టైటిల్స్ సొంతం చేసుకున్నాడు. ఈ సమయంలో 100 ఫైట్స్ చేసిన అలీ కేవలం నాలుగింటిలో మాత్రమే ప్రత్యర్థికి తలొంచాడు. 1964, 1974, 1978లలో ప్రపంచ హెవీవెయిట్ ఛాంపియన్‌గా నిలిచి..మూడు సార్లు ఈఘనత సాధించిన ఏకైక బాక్సర్‌గా చరిత్ర సృష్టించాడు. తాను బాక్సింగ్ ఆడిన కాలంలో ప్రతి ఒక్క బాక్సర్‌ను ఓడించిన ఘనత కూడా మహ్మద్ అలీకే చెల్లింది. అందుకే ఈశతాబ్దపు క్రీడాకారుడిగా మహ్మద్ అలీ కీర్తిగడించాడు.

వివక్షకు నిరసన : మహ్మద్ అలీకి బాక్సింగ్ దిగ్గజంగా ఎంత పేరుందో మానవతావాది, జాతి, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నత వ్యకిగానూ అంతటి ప్రాముఖ్యాన్ని సాధించాడు. బాక్సింగ్‌లో అనితర సాధ్యం కాని విజయాలెన్నో సొంతం చేసుకున్న మహ్మద్ అలీ జాతి, వర్ణ వివక్షకు గురయ్యాడు. అలీ, 1960 రోమ్ సమ్మర్ ఒలింపిక్స్‌లో లైట్ హెవీవెయిట్ విభాగంలో స్వర్ణం సాధించాడు. స్వర్ణ పతకంతో అమెరికాకు తిరిగొచ్చిన సమయంలో అలీ తన స్నేహితుడితో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లాడు. తెల్ల జాతీయులకు మాత్రమే సర్వీస్ చేస్తామని రెస్టారెంట్ సిబ్బంది అలీకి సర్వీస్ నిరాకరించారు. ఈసంఘటనతో బాధపడి, చలించిపోయిన అలీ..రోమ్ స్వర్ణ పతకాన్ని ఒహియో నదిలో విసిరేశాడు. ఈవిషయాన్ని 1977లో వచ్చిన తన ఆత్మకథలో మహ్మద్ అలీ స్వయంగా పేర్కొన్నాడు. అనంతరం 1996 అట్లాంటా ఒలింపిక్స్‌ను ప్రారంభించిన అలీకి..ఈసందర్భంగా మరో మెడల్‌ను బహుకరించారు ఒలింపిక్స్ నిర్వాహకులు.

నిషేధంలో నాలుగేళ్లు : నల్ల జాతీయులు సాధించిన విజయాలు, రికార్డులకు సామాజికంగా ఎలాంటి గుర్తింపు ఉండేది కాదు. మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ ప్రేరణతో మహ్మద్ అలీ కూడా జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడాడు. ఈమధ్య కాలంలోనే ఇస్లాం స్టేట్‌లో చేరి తన పేరును మహ్మద్ అలీగా మార్చుకున్నాడు. వియత్నాంలో అమెరికా యుద్ధం చేస్తున్న సమయంలో అమెరికన్ సైన్యంలో చేరేందుకు మహ్మద్ అలీ నిరాకరించాడు. సైన్యంలో చేరాలంటే అల్లా ఆజ్ఞాపించాలనే సంచలన వ్యాఖ్యలు కూడా ఈసందర్భంగా చోటుచేసుకున్నాయి. అలీ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణించిన అమెరికా అతడిపై అసమ్మతివాదిగా ముద్ర

వేసింది. బాక్సింగ్ చేయకుండా అన్ని రాష్ట్రాలు అలీకి అనుమతి నిరాకరించాయి. పాస్‌పోర్టును కూడా రద్దు చేయటం జరిగింది. వియాత్నంతో యుద్ధం ఏమాత్రం న్యాయసమ్మతం కాదని మహ్మద్ అలీ బలీయంగా విశ్వసించటంతో పాటు దీనిపై బాహాటంగా వ్యాఖ్యానించాడు. అందుకు ఆగ్రహించిన ప్రభుత్వం సైన్యంలో చేరేందుకు నిరాకరించినందుకు అభియోగం మోపటంతో పాటు నిషేధం విధించింది. అన్యాయంగా తనపై నిషేధం విధించటం పట్ల ఏమాత్రం కలత చెందని మహ్మద్ అలీ ధైర్యంగా సుప్రీంకోర్టులో కేసు వేశాడు. మహ్మద్ అలీ వాదనతో ఏకీభవించిన సుప్రీంకోర్టు..ప్రభుత్వం ఆయనపై విధించిన నిషేధం అక్రమమని తేల్చింది. బాక్సర్‌గా శిఖర స్థానాన ఉన్న సమయంలో నిషేధం విధించినా అలీ బాక్సింగ్‌ను మాత్రం వీడలేదు. నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రింగ్‌లోకి అడుగుపెట్టినా..తన పంచ్ వాడి వేడి తగ్గలేదని అనతికాలంలోనే నిరూపించుకున్నాడు.

బాక్సింగ్ కింగ్ : మహ్మద్ అలీ బాక్సింగ్ రింగ్‌లో మకుటం లేని మహరాజు. మూడు సార్లు హెవీ వెయిట్ ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఘనత సొంతం చేసుకున్న యోధుడు. 18 ఏళ్ల ప్రాయంలో (1960) బాక్సింగ్‌లో రింగ్‌లోకి దిగిన మహ్మద్ అలీ, 40 ఏళ్ల వయసులో (1981) ఆఖరి ఫైట్ చేశాడు. కెరీర్‌లో 61 ఫైట్స్ చేసిన మహ్మద్ అలీ కేవలం 5 ఫైట్స్‌లో మాత్రమే ఓటమి చెందాడు. బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన దశాబ్దం తర్వాత గానీ మహ్మద్ అలీ తొలి ఓటమిని చూడలేదంటేనే అతగాడి పంచ్ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మహ్మద్ అలీ సాధించిన 56 విజయాల్లో 37 ఫైట్స్ నాకౌట్ కావట విశేషం (ఫైట్ పూర్తవ్వక ముందే ప్రత్యర్థి చేతులెత్తేయటం).

ఫైట్ ఆఫ్ ది సెంచరీ : శతాబ్దపు ఫైట్‌గా బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన ఫైట్. అమెరికాకే చెందిన మరో ప్రొఫెషనల్ బాక్సర్ జోయ్ ఫ్రెజిర్‌తో మహ్మద్ అలీ తలపడిన మ్యాచ్ ఇది. న్యూయార్క్‌లోని మాడిసన్ స్క్వేర్ దీనికి వేదికైంది. ఇద్దరు దిగ్గజాలకు మధ్య జరుగుతున్న మ్యాచ్ కావటంతో ఈఫైట్ టికెట్లు హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. ఆరోజుల్లోనే తృతీయ శ్రేణి టికెట్‌ను రూ. పదివేలకు అమ్మారు నిర్వాహకులు. పదిహేను నిమిషాల పాటు సాగిన చారిత్రక ఫైట్‌లో జోయ్ ఫ్రెజిర్ విజయం సాధించాడు. ఇదే మహ్మద్ అలీ కెరీర్‌లో చవిచూసిన తొలి ఓటమి. ఈమ్యాచ్ ద్వారా ఫ్రెజర్, అలీలు చెరో 2.5 మిలియన్ల అమెరికన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించారు.

అలీ వారసురాలు లైలా : మహ్మద్ అలీకి తొమ్మిది మంది సంతానం. ఏడుగురు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు. ఏడుగురు అమ్మాయిల్లో కెల్లా అందరికంటే చిన్నమ్మాయి లైలా అలీ తండ్రి బాటలో నడిచింది. దిగ్గజ బాక్సర్ వారసురాలిగా బాక్సింగ్ రింగ్‌లోకి అడుగుపెట్టిన లైలా అలీ..గెలుపు పంచ్‌లోనూ తండ్రిని మించిపోయింది. ఇప్పటి వరకు 24 ఫైట్స్ చేసిన లైలా అలీ..21 ఫైట్స్‌లలో నాకౌట్‌తో నెగ్గింది. ఓటమెరుగని మహిళా బాక్సర్‌గా కీర్తి గడించింది.

అవార్డులు : బాక్సింగ్ రింగ్‌లో ప్రత్యర్థులను గడగడలాడించిన మహ్మద్ అలీ ఎన్నో అవార్డులు మరెన్నో రివార్డులు అందుకున్నాడు. మానవ హక్కుల కార్యకర్తగా, ఐక్యరాజ్య సమితి శాంతి దూతగా సేవలందించిన మహ్మద్ అలీని అమెరికా ప్రభుత్వం 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అవార్డుతో సత్కరించింది. అలాగే ప్రెసిడెన్షియల్ సిటిజన్ మెడల్‌ను కూడా అందుకున్నాడు. బిబిసి 'స్పోర్ట్స్ పర్సనాలిటి ఆఫ్ ది ఇయర్' అవార్డును అందించింది. ఒట్టో హాన్ పీస్ మెడల్ ఇన్ గోల్డ్‌తో ఐరాస అసోసియేషన్ ఆఫ్ జర్మనీ ఘనంగా సన్మానించింది. ప్రిన్స్‌టన్ యూనివర్శిటి 260 స్నాతకోత్సవం సందర్భంగా మహ్మద్ అలీకి గౌరవ డాక్టరేట్ అందించింది.



కథావస్తువు కేరాఫ్ అలీ : మహ్మద్ అలీ బాక్సింగ్ ఆడిన రోజుల్నీ మీడియా స్వర్ణయుగంగా పేర్కొంది. ఆటతో, వివాదాలతో అలీ పతాకశీర్షికలకు కథావస్తువుగా మారాడు. మహ్మద్ అలీ ఇతివృత్తంగా వచ్చిన పుస్తకాలు, డాక్యుమెంటరీలు, సినిమాలు సూపర్ హిట్ కోవలోకి చేరాయి. స్పోకెన్ వర్డ్ పేరిటి విడుదలైన కొలంబియా రికార్డు పుస్తకం అప్పట్లో సంచలం సృష్టించింది. ప్రతిష్టాత్మక స్పోర్ట్స్ ఇల్ల్యుస్ట్రేటెడ్ మ్యాగజన్ 37 సంచికలు మహ్మద్ అలీ ముఖచిత్రంతో ప్రచురితమయ్యాయి. బాస్కెట్ బాల్ దిగ్గజం మైఖల్ జోర్డాన్ తర్వాత ఈఘనత సొంతం చేసుకున్న క్రీడాకారుడు మహ్మద్ అలీ. అలీ ఆత్మకథ–ది గ్రేటెస్ట్ వెండితెర మీద ది గ్రేటెస్ట్‌గా కనువిందు చేసింది. బ్లాక్ రోడియో డాక్యుమెంటరీ సినిమాలో అలీ వెండితెరపై తళుక్కుమన్నాడు. మాజీ బానిస జీవితంపై చిత్రించిన ఫ్రీడమ్ రోడ్‌లో అలీ అభినయానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. టీవీ షోలో కూడా అలీ తనదైన ముద్ర వేశాడు. వియాత్నంపై యుద్ధం సమయంలో అమెరికాను ఎదురించిన సందర్భంపై కూడా ఓ డాక్యుమెంటరీ రూపొందింది. స్టాండ్ బై మీ పాటతోనూ అలీ అభిమానులను అలరించాడు. ఇక అలీ వాడిన గ్లోవ్స్ అంటే ఇప్పటికే హాట్‌కేక్. అలీ వివిధ ఫైట్లలో వాడిన గ్లోవ్స్‌తో వేలంలో కోట్ల రూపాయల ధర పలికాయి. ఫైట్ ఆఫ్ ది సెంచరీ సందర్భంగా ఉపయోగించిన గ్లోవ్స్ రికార్డు స్థాయిలో రూ.రెండు కోట్ల 40 లక్షలకు ఓఅభిమాని సొంతం చేసుకున్నాడు.

బాక్సర్‌గా శిఖర సమాన స్థాయికి ఎదిగిన మహ్మద్ అలీ అంతటితో తన పోరాటాన్ని ఆపకుండా సామాజిక అంశాలపైనా పోరాడి అభిమానుల హృదయాల్లో ఈశతాబ్దపు యోధుడిగా గుర్తింపు పొందాడు.

– శ్రీనివాస్ దాస్ మంతటి, 9676340133

ఛాంపియన్స్ శిక్షణ కేంద్రాల్లో, జిమ్‌లలో నుంచి తయారు కారు. ఓ బలమైన ఆశయం, కల, దృక్పథంలో నుంచి ఉద్భవిస్తారు. కళ, సాధించాలనే తపన ప్రస్ఫుటంగా కనిపించాలి. కాని కళ కంటే బలంగా.. సాధించాలనే తపనే ఉండాలి.

–మహ్మద్ అలీ

■ సమీక్షలు

సృష్టి తాత్వికతను అంచనా కట్టే కవితా జిజ్ఞాస



నింగికెగిరిన చెట్లు, కవిత్వం, డా॥సి.నారాయణరెడ్డి, పేజీలు : 206, వెల : 200/-, ప్రతులకు : క్షేత్రజ్ఞ ప్రచురణలు, ప్లాట్ నెం. 48, రోడ్‌నెం.6, ఫిల్మ్‌నగర్ కాలనీ, జూబ్లీ హిల్స్, హైదరాబాద్33. మరియు అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు.

కాల గమనంలో కవిత్వపు ఉనికికి సంబంధించి ఒక రూపానికుండే పుట్టుకని, పరిణామాలను, వికాసాన్ని గమనించి కొన్ని కొత్త తరాలతో కలిసి నడిచే కాలాలా ఏ భారతీయ సాహిత్యంలోనైనా తక్కువే. తెలుగు వచన కవిత్వానికి నారాయణరెడ్డి గారి వల్ల ఆ అదృష్టం దక్కింది. సుమారు ఆరున్నర, ఏడుపదుల కవితా జీవితం ఉన్న నారాయణరెడ్డి గారి కొత్త కవిత్వం 'నింగికెగిరిన చెట్లు'.

ఇందులో నూరు పేజీల పైబడిన కవిత్వంతో పాటు 'సంస్పందనలు' పేరుతో మరికొన్ని కవితాత్మక వచన భాగాలున్నాయి. ఈ రెంటిలోనూ నిర్వచన దృష్టితో జీవితాన్ని వ్యాఖ్యానించడం కనిపిస్తుంది. ప్రధానంగా ఇందులో ప్రతి కవిత వెనుక ఒక బలమైన తాత్విక భావన, మనో వైజ్ఞానిక భూమిక ఉన్నాయి. మొదటినుంచి నారాయణరెడ్డిగారిలో సమాజాన్ని ప్రగతివైపు నడిపించే శక్తి ఒకటి కవిత్వం నిండా పరుచుకుని ఉంటుంది. ఈ కవిత్వంలోనూ ఈ ధార అత్యంత దీప్తివంతంగా కనిపిస్తుంది.

ప్రనధానంగా ఈ సంపుటిలో ప్రకృతిలో నిరంతరం జరిగే చర్యలను జీవితంలో సమన్వయం చేయడం కనిపిస్తుంది. ఆకాశానికి వెళ్లిన నీరు మళ్లీ వర్షంగా రావడం, గ్రీష్మంలో రాలిన పచ్చదనం వసంతంలో మళ్లీ వికసించడం, ప్రకృతిలో జరిగే పరిణామాలు, పరిణితులు, ధ్వనిగతంగా, తాత్వికంగా ఈ కవిత్వంలో దృశ్యాలు నిలుస్తాయి. బహుశా అందువల్లే 'శ్వా, ఊర్పు, ఊపిరి, వడగాలి, పిల్లగాలి, చిరుగాలి, సుడిగాలి, చల్లగాలి, చెట్లు, కొమ్మలు, నదులు, వసంతం, గ్రీష్మం, నేల, ఎడారి' లాంటి ప్రకృతి, వాతావరణం అనే అర్థ క్షేత్రాల వెంబడి ఈ కవిత్వం పెనవేసుకుంది. అనేక వాక్యాలలో మనిషికుండే సంకల్పశక్తిని, ప్రకృతి గాత దృశ్యాలతో కవిత్వం చేస్తారు.

"ఉప్పొంగే ఊహలకు కాలనియమం లేదు/ జాగ్రదృష్టిలోనే కాదు / స్వప్నంలోనూ స్వచ్ఛందంగా ఎగిరిపోగలవు" (పేజీ93)

"నా చూపులు చేసిన తీవ్ర హుంకారంతో / సుడిగాలి తటాలున ఎగిరిపోయింది" (91పే)

"రెమ్మపైన బోర్లాపడి / మూల్గుతున్న గాయపడిన పిచ్చుక/ టపటప రెక్కలారుస్తూ/ ఎగసిపోయి సంతృప్తిగా ఉంది" (88పే)

"ఎప్పుడూ చూస్తున్న ఆకాశమే/ ఇప ్పుడు సరికొత్త ఎత్తులోకి / ఎగురుతున్నది" (54పే)

"చెట్లు తమ వేర్లు తెంచుకుని హఠాత్తుగా/ నింగికెగిరి పోయాయి" (50పేజీ)

"నదుల అలయి నింగికెగిరి పోవాలని కోరుకుంటాయి" (94పే)

ఈ వాక్యాలన్నిటిలో ఎగియడం క్రియను ఉపాంతంగా చేసుకుని ధ్వనిగతంగా ప్రతీకాత్మకంగా జీవితానికి, ప్రకృతికి మధ్య సమన్వయం చేయడం కనిపిస్తుంది. మొదటి నుంచి నారాయణరెడ్డిగారిలో ప్రయోగ శీలత, ప్రౌఢభాషా ప్రయోగం ఎక్కువ... ఈ సంపుటి లోనూ అలాంటి భాషా మూర్తిత్వాన్ని గమనించవచ్చు.

'ఆత్మ స్వరవంశించడం (90పే), ధ్వని స్పర్శ (87పే), హరిత భాష (91పే), నిర్లిప్త శ్రవణులు(81పే), సంకల్పాలను చదువుకోవడం(85పే), గర్జన్మేఘం (100పే), హార్మోన్మేలితం (30పే), సముద్దీప్త చైతన్యం (49పే), నిశ్చల చిత్తవృత్తి (45పే), పరిమళపర్వం (115పే) ఇలాంటి పద బంధాలను ఎన్నింటినైనా ఎత్తిరాయొచ్చు. అన్ని వాక్యాలలోనూ కవిత్వమంతా ఒక చైతన్యం ప్రవహిస్తుంది. ఈ సంపుటిలో ఒక నారాయణరెడ్డిగారే చెప్పుకున్నట్లు ఆయన కవిత 'మంచు కురుస్తున్నప్పుడు గోర్వెచ్చగా ఉబికి వచ్చే కవిత".

- ఎం. నారాయణశర్మ, 9177260385

ఉపకరించే వృత్తిపదకోశం

**మాండలీకం (తెలంగాణ కులవృత్తి పదకోశం)
సంకలనం: భూతం ముత్యాలు,
ఎడిటర్: వేముల ఎల్లయ్య
పేజీలు: 162,
వెల: రూ. 100.
ప్రతులకు: రచయిత
4-11-117/1, చైతన్యపురి కాలనీ
(ఎల్.హెచ్.సి.రోడ్డు), డి.వి.కె.రోడ్డు
నల్లగొండ-508 001**

భారతీయ సమాజంలో కులం వాస్తవం. కులంతో ముడిపడిన వృత్తులు అనేకం. ఆయా వృత్తులకు ప్రత్యేకమైన పరిభాష వుంటుంది. సర్వసాధారణమైన వ్యవహారికంతోపాటు ఆయా కులాల సంస్కృతినీ, వృత్తి వైవిధ్యాన్నీ ప్రతిఫలించే భాష వుంటుంది. సహజంగా ఆయా కులాల వాడుకలో వుండే కుల మాండలికాల్లోనే ప్రత్యేకమైన పదజాలం వుంటుంది. మరి ఆ పదజాలానికి సంబంధించిన ఒక పదకోశాన్ని భూతం ముత్యాలు రూపొందించారు. దీని వెనుక విశేషమైన కృషి వుంది. ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ముత్యాలు మంచి కవి, రచయిత. గ్రామీణ జీవితపు చలనసూత్రాలు, భాషావ్యవహారాలు అతని రక్తంలోనే సమ్మిళితమై వున్నాయి. కనుక 'మాండలీకం' శీర్షికన తెలంగాణ కుల వృత్తి పదకోశం తీసుకొచ్చారు. ఈ పుస్తకానికి ఎడిటర్‌గా వేముల ఎల్లయ్య వ్యవహరించారు. నల్లగొండ లోని 'గుంపు' సాహితీ సంస్థ దీనిని ప్రచురించింది. క్షేత్రస్థాయి అస్తిత్వ అనుభవం, పరిశీలన, పరిశోధనా దృష్టి, నిజాయితీతో కూడిన శ్రమ వల్లనే ఈ పుస్తకం రూపొందింది. భాషా శాస్త్రజ్ఞులు చేయాల్సిన కృషిని ముత్యాలు ఎంతో శ్రమకోర్చి నిర్వహించారు. తెలంగాణలో భాషాశాస్త్ర పరిశోధనలకు మంచి ఉపకరణం ఈ గ్రంథం. అంతేగాదు, వృత్తిపదకోశాల నిర్మాణం ఇతరులు గుర్తిస్తారు ఈ పుస్తకం చదివాక. కనుక భూతం ముత్యాలు చేసిన ఈ ప్రయత్నం అభినందనీయం. మాండలికంపై ఆసక్తిగల వారు మాత్రమే కాదు, తెలుగు భాష, సాహిత్యరంగాల్లో వున్నవారు అవశ్యం చదవాల్సిన గ్రంథం.

బా రహమతుల్లా కథలు



అచ్చ తెలంగాణా ఉర్దూ మిశ్రిత యాసలో మనస్సు హల్కా అయినట్లు, దేహాలు ఖీమా కొట్టినట్లు, రోజ్‌దార్లను లేపడానికి, బఖాలా పొట్టే బొమ్మన్ పొట్టే హైతో బస్, యే మారి మిలేకో ఖానా కభి నక్కో (దోస్తులుంటే చాలు, అన్నం కూడా వద్దు) వంటి పదాల కలయికలతో కుటుంబ సంబంధ బాంధవ్యాలు, గ్రామీణ జీవన స్థితి గతులు ఉన్నవున్నట్లు అచ్చు గుద్దిన కథా సంపుటి బా రహమతుల్లా కలం నుంచి జాలువారిన 'బహెన్'. మొత్తం 12కథలు కూర్చిన ఈ సంపుటిలో పరిశుద్ధమైన ఇస్లాం సంస్కృతితోపాటు ఆర్థికంగా వెనకబడ్డ ప్రజల జీవన విధానం కొట్టొచ్చినట్టు కనబడుతుంది. అప్పు తీసుకున్న బ్యాంకు వారికి వడ్డీ అవసరం లేదని లిఖిత పూర్వకంగా విన్నవించుకోవడం, బాజాభజంత్రీలు, ఫోటోలు, వీడియోలు, కట్నకానుకలు వంటి హంగు ఆర్భాటాలు, లేకుండా పెళ్లిళ్ల చేయాలని కోరుకోవడం ఇస్లాం సాంప్రదాయాలకు చిహ్నం అయితే, ఎటువంటి దుర్భర పరిస్థితులైనా సహనంగా ఎదుర్కోవడం, హిందూ,ముస్లిమ్‌ల మధ్య సహకార గుణం...ఈ కథల్లో ప్రస్ఫుటమవుతుంది. 'బడోంకి ఈద్' కథలో చనిపోయిన తన చెల్లి కరీమూన్ ను గుర్తు చేసుకునే విధానం పాఠకుల మనసులో "ఓహెూ! ఇటువంటి అమ్మాయి మా ఇంట్లోను ఉంటే ఎంత బాగుండు" అనిపిస్తుంది. రచయిత తన మేనల్లుడితో 'మీ అమ్మను చూస్తేనే ఎవరికైనా అనురాగం, ఆత్మీయత కలిగేవి' అంటాడు. కరీమూన్ సొట్టబుగ్గల అందం, గలగల నవ్వులు, ఓపిక సహనంలోనే వారి కుటుంబ జీవన విధానం పులకరిస్తుంది. "మా" కథలో రచయిత తల్లి అనారోగ్యంతో ఆసుపత్రి పాలైతే బంధు మిత్రుల ఆప్యాయతలు, ఓదార్పులు ఆర్థిక, సాంప్రదాయాలకు బలం చేకూరుస్తాయి. కైసరున్నిసాబేగం, చాంద్‌కి ఈద్, బా, కిరాయిమకాన్, అబ్జల్ బిచారా, నర్గిస్ వంటి కథలన్నీ ఈ కోవకు చెందుతాయి. బుచ్చిగాని భాగోతం గ్రామీణ పేదప్రజల జీవితం కళ్ళకు కట్టినట్లు పాఠకులముందుంచారు. బోర్డర్స్ గుజరాత్ ఉదంతం ముస్లిమ్‌లపై ఎటువంటి ప్రభావం చూపిందో బాగా వివరించారు. ఈ కథలన్నీ కల్పితాలో, వర్ణనలో కాక వాస్తవిక అనుభవాలన్నది సత్యం. కనుక ఇది ప్రతి ఒక్కరు చదివి తీరాల్సిన కథా సంపుటి.

మహేష్ దుర్గే, 9700888972

స్ఫూర్తినిచ్చే తెలంగాణ యోధుని చరిత్ర



తెలంగాణా సాయుధపోరాటం శౌర్యగాథలు, నా అనుభవాలు (స్వీయచరిత్ర),
రచన: దుంపల మల్లారెడ్డి, పేజీలు: 120, వెల: రూ. 60
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

పోరాటయోధుల ఆత్మకథలు, జీవితచరిత్రలు చదవడం స్ఫూర్తిదాయకం. గతంతో పోలిస్తే ఈతరం వారు ఎంతో కొంత సౌకర్యవంతమైన జీవితం అనుభవించడానికి నాటి పోరాటవీరుల త్యాగాలే కారణం. ఈ విషయం మరింత స్పష్టంగా తెలుస్తుంది దుంపల మల్లారెడ్డి గారి ఆత్మకథ చదివితే. 'తెలంగాణ సాయుధ పోరాటం శౌర్యగాథల, నా అనుభవాలు' శీర్షికన వచ్చిన పుస్తకం మల్లారెడ్డి గారి సాహసాల్ని, త్యాగాల్ని తెలియజేస్తుంది. నల్లగొండ జిల్లా యాదగరి గుట్ట మండలంలోని కాచారం గ్రామానికి చెందినవారు మల్లారెడ్డి గారు. నాలుగో తరగతి వరకు చదివిన ఆయన పోరాటంలో నిర్వహించిన పాత్ర అపూర్వం. మల్లారెడ్డి గారి జీవితాన్ని తెలియజేయడమేకాదు, ఆనాటి సామాజిక జీవనం ఎలా ఉండేదో ఈ పుస్తకం వివరిస్తుంది. అలాగే విసునూరు దేశ్‌ముఖ్ దోపిడీ దౌర్జన్యాలకు, రజాకార్ల, మిలటరీ దళాల దాడులకు వ్యతిరేకంగా చేసిన సాహసోపేతమైన పోరాటాల తీరుతెన్నులు వివరించారు. జీవితంలో అనేకవిధాల కష్టనష్టాలు, భీకరమైన నిర్బంధ పరిస్థితులు ఎదుర్కొన్నా ధైర్యంగా నిలిచారు. తన అనుభవాల్ని, అనుభవ పరిధిలోకి వచ్చిన విషయాల్ని సవివరంగా చెప్పారు. అందుకే ఈతరం యువతకు ఇది స్ఫూర్తిదాయక స్వీయచరిత్ర. మల్లారెడ్డి గారు 26 మార్చి 2006న చనిపోయారు. ఇన్నాళ్ళకయినా వారి స్వీయచరిత్రని ప్రజాశక్తి బుక్‌హౌస్ అందించడం ముదావహం. ఈ పుస్తకానికి ఉన్న ప్రాధాన్యాన్ని డా. తిరునగరి ముందుమాటలో వివరించారు.

నాకు నచ్చిన పుస్తకం

చలం 'జెలసీ' కథలు

చలం అనగానే గుర్తుకొచ్చేది స్త్రీ వాదం. ఆనాటికీ వాదాలు, వివాదాలు ఉన్నా లేకపోయినా, చలం రచనలన్నీ స్త్రీ పక్షంగానే ఉన్నాయనడంలో అతిశయోక్తి ఏమీ లేదు. నేను 1960–75 మధ్య చలం రచనలు కొన్ని చదివాను. మళ్లీ 1985–90 ల మధ్య చలాన్ని చదవాలనే బలమైన కోరిక వల్ల వారి ముఖ్యమైన రచనల్ని మరోమారు చదవడం జరిగింది. ముఖ్యంగా 'మైదానం, అమీనా, శశిరేఖ, పురూరవ, సావిత్రి, జానకి, జెలసీ. నాకు నచ్చిన పుస్తకం జలసీ. ఇందులో పది కథలున్నాయి. వాటిల్లో జెలసీ, నా మొదటి క్రాఫ్, అట్లపిండి' కథలు చదివినప్పుడల్లా నవ్వు వస్తూనే ఉంటుంది. ఆ హాస్యంలో వారి వ్యంగ్యం మెత్తగా సుతి మెత్తగా సమాజాన్ని మందలించినట్లుంటుంది. మొదటి కథ జెలసీలో చలపతిరావుకు వితంతువుల మీద కరుణ పుట్టిందని చెబుతూ, చలపతిరావు చేసిన వికృత చేష్టల్ని హాస్యంగా చెబుతూనే కుహనా సంస్కరణ వాదుల్ని ఎండగడుతూ, వ్యంగ్యంగా నర్మగర్భంగా మందలించారు చలం.

మరో కథ నా మొదటి క్రాఫ్‌లో మొక్కు పేరిట పిలక కత్తిరింపు. సీతాపతి భార్య తిరుపతిలో జుట్టు మరచిపోయి వస్తే, వితంతువు అనుకుని, భర్తకే దాన్నిచ్చి మళ్లీ వివాహం చేసి అది రెండువందల ఆరో వివాహమని పేపర్లో వైభవంగా వేయించుకున్న వితంతు వివాహ ఏజంట్ వ్యవహారాన్ని హాస్యంగా రాశారు.

ఇక అట్ల పిండి కథ సరేసరి. ఈ కథ నేను పైకి చదువుతుంటే మా ఆవిడకు నవ్వాగలేదు. 'వాళ్ల నానమ్మను ఈ కథలో చలం ఎలా చూపించారా?' అని ఆశ్చర్యపోతూ ఆ నానమ్మ లో మా ఆవిడ వాళ్ల నానమ్మను తలచుకుని పొట్ట చెక్కలైయ్యేట్టు నవ్వుకున్నాం. ఈ తరం తప్పక చదవదగిన కథలు చలం జెలసీ కథలు.

– మండవ సుబ్బారావు,
కొత్తగూడెం

■ ఈ వారం కవిత్వం

అయినా సంతోషంగానే ఉంది

ఇప్పుడంతా సందిగ్ధంగా వుంది
ఎక్కడ మొదలుపెడితే దేనికి దారి తీస్తుందో?
దేన్ని ముట్టుకుంటే ఎలా విచ్చుకుంటుందో?
చెప్పడం కష్టంగానే వుంది
మట్టిని తడిపి కుండను చేసినట్టు
వెదురును చీరి బుట్టల్లినట్టు
సిద్ధాంతాన్నెలా నిర్మించాలో
అంతా గందరగోళంగా వుంది
చేపపిల్ల గొంతుకు గాలం బిగించొద్దంటే
ఆకలి కడుపు విసిరే అనేక ప్రశ్నలకు
సమాధానాలెక్కడినుంచి తేవాలో అంతుపట్టటం లేదు
ఐదు వేళ్లు కలిస్తేనే అన్నం తింటామన్నప్పుడు
అవన్నీ సమానంమెందుకు లేవోనని
బుర్ర బద్దలు కొట్టుకోవాల్సి వస్తుంది
మా నాయిన కండలు తిరిగితేనే
బువ్వ నట్టింట్లోకి నడిచొస్తుంటే
ఔషధం గొంతు దిగితేనే
రోగం తోక ముడిచి పారిపోతుంటే
అంతా మిథ్యేనని వినటానికి నొప్పిగానే వుంటుంది
మిథ్యావాదీ!
అయినా నాకిప్పుడు సంతోషంగానే వుంది
నీ బారి నుంచి బయట పడ్డందుకు!

– తోకల రాజేశం, 9676761415

నమ్మకస్తులు



కూర్చునేటోళ్ళు
పల్లకి మోస్తారనుకోవడం
విడ్డూరం.
ఉరికించెటోళ్ళు
ఎత్తుకుంటారంటే ఆశ్చర్యమే,
వాగ్దానాలు
మూటగట్టి దాచుకోవడం అవివేకమే.
అయ్యా!
ఎక్కడైనా డజనంటే పన్నెండన్నట్టు
వాళ్ళు నమ్మకస్తులే.
అమ్మా!
బియ్యంల మెరిగెల్లాంటోళ్ళం,
వాళ్ళ కంచంల కరివేపాకులం
చీకటి
రేపు తెల్లారుతుందని నమ్మినోళ్ళం.

– జి.రామకృష్ణ, 8977412795

అంతరంగ కాశ్మీరం

నా అందాన్ని చూస్తే
నాకెప్పుడూ అసహ్యమే
అందాన్ని శాపంగా
మిగుల్చుకున్న అనాథను
తెల్లని మేను మీద
ఖండిత గాయాలు
పచ్చని యవ్వన సరిహద్దుమీద
బాంబుల సంతకాలు
నడివీధుల్లో బూట్ల కింద
నలుగుతున్న పూల రోదనలు
ముఖమల్ శాలువా కప్పుకున్న
భయానక దృశ్యం నా శరీరం
నేను నగ్నంగా నిలబడితే
మీరంతా సిగ్గుపడతారు
బాధపడతారు భయపడతారు
ఇప్పుడిక్కడ పారినవి వరదలు కావు
వానొక మిష
వరదొక సాకు
నా ఆవేదన
నా రోదన
ఈ గుండె పగుళ్ల నుంచి
ఉబికి ప్రవహించి
సమస్త దేహాన్నీ
ముంచేస్తున్న దు:ఖం
ఏ అగాధాల చెవియొగ్గి విన్నా
మంచు పొరల కింద ఖననం
చేయబడ్డ
నా బిడ్డల ఆర్తనాదాలు వినబడతాయి
గాలికి ఊగుతున్న
ఏ పచ్చని ఆకును చూసినా
శీలం రాలిపడుతున్న
శిశిరం గుర్తొస్తుంది
అందాల హరివిల్లు కాదు
అల్లకల్లోల విధ్వంస దృశ్యం
ఇప్పుడు చెప్పండి
మీరనుకున్నట్లు నేను
భరతమాత సిగపూవునేనా?

రేపటి పొద్దును ఆడగాలి

– కేతిరెడ్డి యాకూబ్‌రెడ్డి,
9989584549

అదిరేటి డ్రస్సులు

ఈ పాప ఎంత క్యూట్‌గా ఉందో ఆమె వేసుకున్న డ్రెస్సులు అంతకంటే బాగున్నాయి కదూ! ఈ డ్రెస్సులని తన నాలుగేళ్ల కూతురికోసం ఏంజీ కైసర్ తయారు చేసింది. దేనితో తయారు చేశారో తెలుసా? కేవలం పేపర్, టేపు, కత్తెరతోనే! ఆశ్చర్యంగా ఉన్నా ఇది నిజం. కావాలంటే మీ చిన్నారుల కోసం ఇలా తయారు చేసి చూడండి. విజయం సాధించారా... ఇక మీరూ ఓ డిజైనర్ అయినట్లే!

eT

మిలమిల మెరిసే తార

మనసు దూది పింజెలా తేలిపోతుందంటారు. ఈ ఫొటోలను చూస్తుంటే అలానే అనిపిస్తుంది కదూ! మంచు కురుస్తున్నట్లు... తారాజువ్వల నుండి వెలుగులు విరజిమ్ముతున్నట్లు... నీలాకాశంలో కనువిందు చేస్తున్న తారలను కెమెరాలో బంధించింది ఫిన్లాండ్‌కు చెందిన మిక్కో లాజర్‌స్టెడిక్ట్. మిక్కోకి ఫొటోలు తీయడమంటే చాలా ఇష్టం. అది కూడా రాత్రి పూట నక్షత్రాలను తీయడం మరీ ఇష్టం. మిక్కో తీసిన ఫొటోలు ఫేస్‌బుక్‌లో పెడితే నాలుగు లక్షల లైకులు వచ్చాయంటేనే అర్థం చేసుకోవచ్చు, అతను తీసిన ఫొటోలు ఎంత అద్భుతంగా ఉంటాయో. ఇప్పుడు మీరు చూస్తున్న ఫొటోలు వాటిలో కొన్ని మాత్రమే.